723 పాఠశాలలు.. పదిమందిలోపే పిల్లలు!



ఉమ్మడి జిల్లాలో
- 24 పాఠశాలల్లో అసలు విద్యార్థులే లేరు.
- 126 పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్కరూ లేరు.



పాలతోడు ప్రాథమిక పాఠశాలలో ఒక్కరే విద్యార్థి

వైకాపా నిర్ణయంతో కళతప్పిన బడులు

న్యూస్‌టుడే, పామర్రు

1.. 2.. 3.. 4.. 10.. ఇవన్నీ ఏదో జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ర్యాంకులనుకునేరు..! కాదండీ బాబు.. ఉమ్మడి జిల్లాలో పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య. కొన్నిచోట్ల అసలు బాలలే లేరు. పిల్లలతో కళకళలాడాల్సిన పాఠశాలలు గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో వెలవెలబోతున్నాయి. వైకాపా అయిదేళ్ల పాలనలో ప్రాథమిక విద్య కోలుకోలేనంతగా విధ్వంసానికి గురయ్యింది.

వైకాపా హయాంలో జీవో 117ను అమలు చేసి 3, 4, 5 తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ఆ ప్రభావం ప్రాథమిక బడులపై పడింది.

నష్టం జరిగిందిలా..

సాధారణంగా పిల్లలను ఒక పాఠశాలలో చేర్పిస్తే ప్రాథమిక విద్య అంతా అక్కడే కొనసాగించడానికి తల్లిదండ్రులు ఇష్టపడుతుంటారు. విలీనం కారణంగా ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు మాత్రమే ఉండడంతో ఆ రెండేళ్లు మాత్రమే అక్కడ చదివించడం ఎందుకు? అయిదు తరగతులున్న బడిలో చేర్చాలని భావిస్తున్నారు. మరోవైపు 3, 4, 5 తరగతులు చదివేందుకు బడులు కూడా కొంత దూరాభారంగా మారడంతో పిల్లల్ని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడానికే మక్కువ చూపారు. దీంతో ప్రభుత్వ ప్రాథమిక బడుల్లో విద్యార్థుల చేరికలు గణనీయంగా పడిపోయాయి. సున్నా స్కూళ్లు పెరిగిపోయాయి.

ఇదీ పరిస్థితి
- ఉమ్మడి జిల్లాలో మొత్తం పాఠశాలలు 3,812
- ప్రాథమిక స్కూళ్లు 2,920
- వీటిల్లో చదువుతున్న విద్యార్థులు (సుమారు) 1.25 లక్షల మంది
- విలీనం చేసిన ప్రాథమిక పాఠశాలలు 368

లోకేశ్ ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు

ఉపాధ్యాయ సంఘాల నేతలతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇటీవల చర్చించారు. జీవో నంబరు. 117 రద్దు చేయాలని, 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియ ఆపాలని అంతా విన్నవించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విలీనం నిలిపేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం వస్తుందని ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు.

విద్యార్థులే లేని బడులు

- **కోనసీమ జిల్లా:** సఖినేటిపల్లి మండలం సూర్యనారాయణ పేట, సఖినేటిపల్లి లంక, మలికిపురం మండలం బాడవ
- **కాకినాడ జిల్లా:** తాళ్లరేవు మండలం హోప్‌ఐలాండ్, పెదపూడి మండలం ముక్తేశ్వరం
- **తూర్పుగోదావరి జిల్లా:** చాగల్లు మండలం మల్లవరం, ఎంపీపీఎస్(మెయిన్)

నేడు అర్జీల స్వీకరణ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అమలాపురం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారా వేదిక నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జేసీ నిశాంతి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. కలెక్టర్ మహేష్ కుమార్ మండపేటలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కలెక్టరేట్‌లో జేసీ, జిల్లా స్థాయి అధికారులు వినతులు స్వీకరిస్తారన్నారు.

కరుణచూపలేదు కన్నా..

తల్లి పేగు తెంచుకు పుట్టిన కనుపాప ఏమైందో ఏమో..
ముళ్లపొదల్లో మరణశాసనం రాశారు..
ఆ బిడ్డ మృతి మానవత్వాన్ని ప్రశ్నిస్తోంది.
కళ్లు తెరవకుండానే, అమ్మపొత్తిళ్లు చేరకుండానే..
నూరేళ్లు నిండుతున్న పసికందుల ఆత్మఘోషకు అంతమెప్పుడు..?



కత్తి దూశాడు ఓ అన్న

పేగు పంచుకు పుట్టినవాడే పగబట్టాడు..
కత్తిదూసి తమ్ముడినే కడతేర్చాడు..
చిన్నప్పుడు దారిచూపిన చెయ్యే పెద్దయ్యాక ఆస్తి మైకంలో కత్తి దూసింది..
అన్నదమ్ముల సవాళ్లతో..
బంధాలు బలిపీఠమెక్కుతుంటే..
అంధకారం అలముకుంటుంటే..
అనుబంధాలకు ఆస్కారమేదీ..?



-వివరాలు 10లో

గాజుల గౌరీ..



అమలాపురంలోని శ్రీకామాక్షీ ఏకాంబరేశ్వరదేవి భారీ సంఖ్యలో గాజుల అలంకరణలో దేదీప్యమానంగా వెలుగొందారు. అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

–న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

టమాటా @100

ఈనాడు, కాకినాడ, దేవీచౌక్ (రాజమహేంద్రవరం)

ఉమ్మడి జిల్లాలో సాగు తీరిదీ.. (ఎకరాల్లో)	
కాకినాడ	692
తూర్పు గోదావరి	283
అంబేడ్కర్ కోనసీమ	200



టమాటా ధర రారెత్తిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో రూ.80 నుంచి రూ.100కు విక్రయిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ధర మరింత పెరగవచ్చనే వాదన వినిపిస్తోంది. డిమాండ్‌కు తగ్గ దిగుబడి లేకపోవడమే ఈ పరిస్థితి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు రైతు బజార్లలో ధరలకు.. రిటైల్ మార్కెట్ ధరలకూ భారీ వ్యత్యాసం ఉండడంపై చర్చ నడుస్తోంది.


జిల్లా కేంద్రం కాకినాడలోని రైతు బజారులో కేజీ టమాటా ధర రూ.40కి విక్రయిస్తుంటే.. బయట మార్కెట్లో, వీధుల్లో విక్రయించే వారు కేజీ రూ.100కు అమ్మారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో కేజీ రూ.100కు అమ్ముతున్నారు. ధరలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం ఈ భారీ వ్యత్యాసానికి కారణమనే వాదన వినిపిస్తోంది. వర్షాల కారణంగా మచ్చలు ఏర్పడి నాణ్యత తగ్గిందని ఎస్టేట్ అధికారులు పేర్కొంటున్నారు.



రైతుబజారులో రాయితీ టమాట విక్రయాలు

పొరుగు పంటతో పేచీ..

ఉమ్మడి జిల్లాలో పండిస్తున్న టమాటా తక్కువే. ఇక్కడ పండిన పంట జనవరి, ఫిబ్రవరి, మార్చి అవసరాలకు సరిపోతుండడంతో మిగిలిన నెలల్లో మదనపల్లి, పలమనేరు, కలికిరి తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. పలమనేరు మార్కెట్‌లో 15 కేజీల టమాటా పెట్టె ధర రూ.850 పలుకుతుంటే.. రవాణా, కూలీ ఖర్చులు, తరుగు అన్నీ పోను ఇక్కడికి వచ్చేసరికి రెట్టింపు ధరకు అమ్ముతున్నారు.



చిన్న ఆలయం.. పెద్ద ఊరట

ఈనాడు, రాజమహేంద్రవరం

జిల్లా	ఆలయాలు
తూర్పుగోదావరి	86
కాకినాడ	174
అంబేడ్కర్ కోనసీమ	169

ధూప, దీప, నైవేద్యాలకు(డీడీఎన్) ఇబ్బంది పడుతూ నిర్వహిస్తున్న చిన్న ఆలయాలకు నెలవారీ ఇస్తున్న రూ.5 వేలను రూ.10 వేలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దేవాదాయశాఖ ప్రత్యేక కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై అర్చకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తూర్పు గోదావరి, కాకినాడ, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో పల్లెల్లో ఉన్న చిన్న, తక్కువ ఆదాయం వచ్చే ఆలయాలు(గ్రూప్-సి) 429 ఉన్నాయి. వీటిల్లో ధూపదీప నైవేద్యాలకు రూ.10 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ మొత్తంలో అర్చకులకు రూ.7 వేలు, ఇతర ఖర్చులకు రూ.3 వేలు చొప్పున కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో చిన్న ఆలయాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న అర్చకులకు నెలకు రూ.4 వేలు అదనపు సాయం అందనుంది.

ధూపదీప నైవేద్యాలకు ఇకపై రూ.10 వేలు

నెలకు రూ.42.90 లక్షలు

డీడీఎన్ పథకం ద్వారా గతంలో నెలకు రూ.2,500 ఇస్తుండగా గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలోనే రూ.5 వేలకు పెంచుతూ చేయూతనిచ్చారు. తాజాగా మళ్లీ రూ.10 వేలకు పెంచారు. ఈ మొత్తాన్ని దేవాదాయ శాఖకు చెందిన సర్వశ్రేయోనిధి(సీజీఎఫ్) నుంచి వినియోగిస్తారు. ఉమ్మడి జిల్లాలో నెలకు రూ.42.90 లక్షలు ఆలయాలకు చెల్లించనుండగా.. అర్చకులకు రూ.30 లక్షల వరకు మేలు జరగనుంది.

ఇవీ నిబంధనలు...


- ఆలయం 25 ఏళ్ల క్రితం నిర్మితమై దేవాదాయశాఖ చట్ట పరిధిలో ఉండాలి.



గోకవరంలోని పర్వత వర్ధని రామలింగేశ్వరస్వామి ఆలయం

- పురాతన ఆలయాలకు ప్రాధాన్యం. గ్రామీణ ప్రాంతాల పరిధిలో ఉండాలి.
- రెండున్నర ఎకరాల్లోపు చిత్తడి లేదా అయిదెకరాల్లోపు మెట్ట భూమి ఉండి ఏడాదికి రూ.30 వేలలోపు ఆదాయం సమకూరే ఆలయాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు.
- భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామదేవతల ఆలయాల్లో పూజారుల ఆధ్వర్యంలో నిత్యం కైంకర్యాలు నిర్వహించేవాటినీ పరిగణనలోకి తీసుకుంటారు.

భక్తులకు కొత్త బస్సులు



అన్నవరం, న్యూస్‌టుడే: భక్తుల సౌకర్యార్థం అన్నవరం దేవస్థానం రెండు కొత్త బస్సులు అందుబాటులోకి తెస్తోంది. సుమారు రూ.80 లక్షల వ్యయంతో(చాసిస్, బాడీ కలిపి) వీటిని తయారు చేయించింది. 40 సీట్ల సామర్థ్యం ఉన్న రెండు బస్సుల చాసిస్‌కు బాడీ తయారీ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే వీటిని ప్రారంభించనున్నారు. భక్తుల రాకపోకలకు ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోవడం లేదు. దీంతో అదనపు బస్సులను సిద్ధం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

దివ్యాంగులకు వర్క్‌ఫ్రం హోమ్ ఉద్యోగాలు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: దివ్యాంగులకు వర్క్‌ఫ్రం హోమ్ ఉద్యోగాలు కల్పిస్తూ, ముందుగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే ప్రత్యేక జాబ్ మేళాను నిర్వహించడం ఇదే తొలిసారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం వి.ఎస్.ఎం కళాశాలలో దివ్యాంగుల కోసం ఆదివారం ప్రత్యేక జాబ్ మేళాను మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వికాస, సార్థక సంస్థలు, ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీ సహకారంతో దివ్యాంగుల కోసం కూటమి ప్రభుత్వం ఈ ఏర్పాట్లు చేస్తుందన్నారు. దేహంలో లోపాన్ని ధైర్యంగా అధిగమించి ఆత్మవిశ్వాసంతో అడుగులేస్తూ దివ్యాంగులందరూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా 38 మంది దివ్యాంగ అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. మంత్రి సుభాష్, కూటమి పార్టీల నియోజకవర్గ నాయకులు ఎంపికైన అభ్యర్థులకు పత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వికాస పీడీ లచ్చారావు పాల్గొన్నారు.

ధర ఎక్కువ.. తూకం తక్కువ

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

- అమలాపురానికి చెందిన విశ్రాంత ఉద్యోగి రెండు కిలోల మేక మాంసం కొనుగోలు చేశారు. తూకం తక్కువగా ఉందనే అనుమానంతో పక్కనే ఉన్న మరో దుకాణంలో సరిచూడగా 300 గ్రాముల వరకు తక్కువ తూగింది. దీనిపై విక్రయదారుడిని ప్రశ్నించగా అతడు ఎదురు తిరగడంతో ఏమీ చేయలేకపోయారు.
- మండపేటకు చెందిన గృహిణి దుకాణంలో రెండు 500 మీ.లీ. పాల ప్యాకెట్లు తీసుకున్నారు. దుకాణదారు ఒక్కోదానిపై రూ.3 అదనంగా తీసుకున్నాడు. ఇదేమని అడిగితే ఇలా అయితేనే గిట్టుబాటు అవుతుందని.. చెప్పడంతో చేసేదేమీ లేక అడిగినంత ఇచ్చి తీసుకున్నారు.

నిత్యం ఇలాంటి మోసాలు వెలుగు చూస్తున్నా.. ఫిర్యాదు చేస్తున్నవారు కొందరే. వినియోగదారుల్లో చైతన్యం అవసరమని అధికారులు చెబుతున్నారు.



అమలాపురంలోని ఓ గోదాములో ఎలక్ట్రానిక్ కాటాను పరిశీలిస్తున్న తూనికలు కొలతల అధికారులు

సిబ్బంది కొరత..

జిల్లాలో ఒక సహాయ నియంత్రణ అధికారి, నలుగురు ఇన్‌స్పెక్టర్లు, 5 మంది సిబ్బంది అవసరం కాగా, కేవలం ఒక అధికారి, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఒక సహాయకుడు మాత్రమే విధుల్లో ఉన్నారు.

ఇవి సరిగా గమనించాలి..

తూకాన్ని తప్పని సరిగా గమనించాలి. కొనుగోలు చేసిన దానికి బిల్లు తీసుకోవాలి. దానిపై ఉన్న ధరకు, వస్తువుపై ఉన్న దానికి సరి పోల్చి చూసుకోవాలి. సరకు నాణ్యతను పరిశీలించాలి. తయారీ, వినియోగ తేదీల వివరాలు కచ్చింగా చూసుకోవాలి. తేడా ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

అప్రమత్తత అవసరం

వినియోగదారులు అప్రమత్తంగా ఉంటే మోసాలను అరికట్టవచ్చు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు తూకంతో నష్ట పోతన్నామని భావిస్తే మాకు తెలియపరిస్తే కేసులు నమోదు చేస్తాం.

-రాజేష్, సహాయ నియంత్రణ అధికారి, తూనికలు, కొలతల శాఖ

కేసుల శాతం దుకాణాల వారీగా..


కిరాణా దుకాణాలు	: 26
మాంసాహారం	: 24
పెట్రోలు బంకులు	: 12
పాలు, శీతల పానీయాలు	: 13
గోదాములు	: 10
ఇతరత్రా విభాగాలు	: 15

ఏడాది	కేసులు	జరిమానా (రూ.లక్షల్లో)
2022–23	491	98
2023–24	641	105
2024 (ఏప్రిల్–సెప్టెంబరు)	315	50

సంప్రదించాల్సిన అధికారుల నంబర్లు

సహాయ నియంత్రణ అధికారి	: 93981 65253
అమలాపురం- ఇన్‌స్పెక్టర్	: 98488 42994
రామచంద్రపురం ఇన్‌స్పెక్టర్	: 86394 62189
టోల్ ఫ్రీ నంబరు	: 1800 425 4202

9 వరకు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ



ఎస్.కనకదుర్గా వరప్రసాద్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా అబ్కారీ సూపరింటెండెంట్ ఎస్.కనకదుర్గా వరప్రసాద్ తెలిపారు. అమలాపురంలోని కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. జిల్లాలో గతంలో 150 దుకాణాలు ఉండగా, ఇప్పుడు 133 ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రాజోలు, రామచంద్రపురం, అమలాపురం, కొత్తపేట, ఆలమూరు, ముమ్మిడివరం ఆరు ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటి వరకు 300 దరఖాస్తులు అందాయన్నారు. 11వ తేదీ ఉదయం కలెక్టర్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రా జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ ద్వారా మూడు పద్ధతుల్లో జరుగుతుందన్నారు. కలెక్టరేట్ గోదావరి భవన్ వద్ద డ్రా నిర్వహిస్తామని అన్నారు.

20 వరకు సెక్షన్ 30 అమలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో నేటి నుంచి 20వ తేదీ వరకు సెక్షన్ 30 అమలులో ఉంటుందని డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆదివారం తెలిపారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలలో ఏడు పోలీస్‌స్టేషన్ల ప్రాంతాల్లో వర్తిస్తుందన్నారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి నిషేధమన్నారు.

సీబీఐకి చిక్కిన కస్టమ్స్ అధికారులు

- రూ.3.18 లక్షలు లంచంతో పట్టుబడిన సూపరింటెండెంట్
- ఏసీ, ఇతర అధికారుల నుంచి రూ. 27.74 లక్షలు స్వాధీనం

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడ పోర్టులోని కస్టమ్స్ కార్యాలయంతోపాటు అధికారుల నివాసాలపై శనివారం సీబీఐ అధికారులు దాడులు నిర్వహించారు. పలువురు అధికారుల నుంచి మొత్తం సుమారు రూ.31 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. లంచం తీసుకుంటున్నారన్న ముందస్తు సమాచారం మేరకు నిఘావేసిన అధికారులు కాకినాడ పోర్టు కస్టమ్స్ సూపరింటెండెంట్ వై.శ్రీనివాస్ వద్ద నుంచి రూ.3,18,200 స్వాధీనం చేసుకున్నారు. లంచం ఇచ్చిన కాకినాడకు చెందిన శ్రీ చంద్ర బల్క్ కార్గో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి పంతం భరత్ కుమార్‌నూ అరెస్టు చేశారు. విచారణ క్రమంలో నిందితుల సమాచారం ఆధారంగా కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ నుంచి రూ.22.74 లక్షలు, మరికొందరు కస్టమ్స్ అధికారుల నుంచి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో అసిస్టెంట్ కమిషనర్, ఇతర కస్టమ్స్ అధికారులు వేరేచోటుకు ప్రయాణానికి సిద్ధమవుతుండగా దాడులు చేసి ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ పేర్కొంది. వీరి పేర్లు మాత్రం వెల్లడించలేదు. ఈ కేసులో కొందరు ప్రైవేటు వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులూ ఉన్నట్లు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను విశాఖపట్నం సీబీఐ న్యాయస్థానంలో న్యాయమూర్తి ఎదుట ఆదివారం హాజరు పరచగా రిమాండ్ విధించారు. విశాఖపట్నం సీబీఐ యూనిట్‌లోని అవినీతి నిరోధక విభాగం బృందాలుగా ఈ సోదాల్లో పాల్గొంది. అనుమానితుల ఇళ్లలో, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి, దస్త్రాలు స్వాధీనం చేసుకున్నామని, దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.



తూడుతో నిండిన ఉప్పలగుప్తం ప్రధాన పంటకాలువ



అధ్వానంగా వాడపర్రు పంటకాలువ

నీళ్లను మింగిన నిర్లక్ష్యం

పొలాలకు సాగునీరు అందించే పంటకాలువలు తూడు, గుర్రపుడెక్క పెరిగిపోయి రూపుకోల్పోయాయి. సన్నవిల్లి, గొల్లవిల్లి తదితర గ్రామాల్లో రైతులు సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. వరిచేలల్లో నీరు తగ్గడంతో ఎలుకల ఉద్ధృతి పెరిగి పంటకు తీవ్రనష్టం కలుగుతోంది. అయినాపురం-వాడపర్రు, ఉప్పలగుప్తం కాలువల దుస్థితికి ఈ చిత్రాలే నిదర్శనం. శనివారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సన్నవిల్లి సర్పంచి చిక్కం పెదబాబు, రైతులు ఈ సమస్యపై ఎమ్మెల్యే ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. తూడు, గుర్రపెడెక్కను తొలగించి, సాగునీరు అందించి పంటను సంరక్షించాలని రైతులు కోరుతున్నారు. మండలంలో 4,200 ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు చేపట్టారు.

–న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

డొక్కా సీతమ్మ సేవలు ప్రపంచానికి ఆదర్శం

గాంధీనగర్: ఆకలితో ఉన్నవారికి అన్నంపెట్టి అన్నపూర్ణగా, అన్నదాతగా డొక్కా సీతమ్మ అందించిన సేవలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని శాసనమండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ చెప్పారు. ఆదివారం ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని ప్రాంగణంలో ఆంధ్రుల అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ జయంతి వేడుకలను ఫిలాంత్రఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజా ఆధ్వర్యంలో వర్ణధార హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు నందిక మహాలక్ష్మికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ ఆమె సేవలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి ఆమె పేరు పెట్టడం ద్వారా ఆమెకు తగిన గౌరవం కల్పించారన్నారు. డొక్కా సీతమ్మ కుటుంబంలోని అయిదోతరం వారసుడు డొక్కా భీమవెంకట సత్య కామేశ్వరరావు మాట్లాడుతూ సీతమ్మ వారసుడిగా గర్వపడుతున్నానని చెప్పారు. ఏపీఎస్‌పీఎఫ్ కమాండర్ కొండా నరసింహరావు, శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో సీతమ్మ కుటుంబ సభ్యుడు కామేశ్వరరావు దంపతులను సత్కరించారు. 20 మందికి డొక్కా సీతమ్మ స్ఫూర్తి పురస్కారాలు అందించారు.

బౌద్ధం.. జీవన మార్గం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: జీవన మార్గమైన బౌద్ధాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బౌద్ధ పీఠాధిపతి అనాలయొ అన్నారు. ఆంధ్రప్రదేశ్ బుద్ధిస్ట్ కౌన్సిల్ తృతీయ సర్వసభ్య సమావేశాన్ని అనాలయొ ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలోని బుద్ధవిహార్‌లో ఆదివారం నిర్వహించారు. త్రిపీటకాలతో పాటు బౌద్ధ గ్రంథాలు సమకూర్చి ఉండ్రాజవరంలోని బౌద్ధ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. వాటిని బౌద్ధులు, సావనీర్‌లు, బౌద్ధాభిమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉండ్రాజవరంలో నిర్మిస్తున్న బుద్ధవిహార్ రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉంటుందన్నారు. బౌద్ధం మతం కాదని, సైన్సుతో పోలి ఉండే అనేక ధర్మాలు బౌద్ధంలో ఉన్నాయన్నారు. ఈ ధర్మాలు మానవ మనుగడకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఉండ్రాజవరంలోని బుద్ధవికాస కేంద్రం ద్వారా వందలాది మంది చిన్నారులు తర్ఫీదు పొందుతున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. బౌద్ధపీఠంలో నిర్వహిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. తొలుత బుద్ధుని మందిరంలో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. నూతనంగా చేపట్టనున్న సేవా కార్యక్రమాలపై ప్రణాళిక సిద్ధం చేశారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంతోపాటు ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల నుంచి బౌద్ధులు విచ్చేసి కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.

బుద్ధిస్ట్ కౌన్సిల్ సమావేశానికి విచ్చేసిన బౌద్ధులు



బుద్ధిస్ట్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న అనాలయొ


లలితా త్రిపురసుందరీదేవిగా ద్రాక్షారామ మాణిక్యాంబ


గుడిమెళ్లంకలో లలిత త్రిపురసుందరీదేవి


మామిడికుదురులో విజయదుర్గమ్మ

అమ్మా.. శాంభవి

దసరా ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. భక్తులు ఆలయాలకు పెద్దఎత్తున తరలివెళ్లి పూజల్లో పాల్గొన్నారు. సామూహిక కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. దీంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

– న్యూస్‌టుడే, మలికిపురం, ద్రాక్షారామ, మామిడికుదురు, అమలాపురం పట్టణం


అన్నపూర్ణాదేవి రూపంలో అమలాపురం శ్రీదేవి అమ్మవారు


లలిత త్రిపురసుందరిగా వాసవీమాత


అష్టోత్తర పూజల్లో భక్తులు

వాడపల్లి క్షేత్రం.. భక్తజన పరవశం

వాడపల్లి(ఆత్రేయపురం): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరుని దివ్య క్షేత్రం ఆదివారం అశేష భక్తజనంతో శోభిల్లింది. ఆలయ పరిసరాలన్నీ గోవిందనామ స్మరణతో ప్రతిధ్వనించాయి. వేంకటేశ్వర సహిత ఐశ్వర్య లక్ష్మీహోమం, కల్యాణం, అష్టోత్తర శతనామావళి పూజలు, గోపూజ, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలను అర్చకులు కమనీయంగా జరిపించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక

నేడు, రేపు శిక్షణ తరగతులు

పి.గన్నవరం: జిల్లాలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించడంపై ఉప సర్పంచులు, ఇద్దరు వార్డు సభ్యులు చొప్పున ప్రతి పంచాయతీ నుంచి ముగ్గురికి రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ నెల 7, 8న మండల పరిషత్ కార్యాలయాల వద్ద వీటిని నిర్వహిస్తారని జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు తెలిపారు. ఇద్దరు వార్డు సభ్యుల్లో ఒక పురుషుడు, ఒక మహిళ ఉంటారు. జిల్లా వ్యాప్తంగా 385 గ్రామ పంచాయతీల నుంచి ముగ్గురు చొప్పున 1,155 మందికి రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకుగాను ఎంపీడీవోలు, పంచాయతీ విస్తరణాధికారులకు ఇప్పటికే సామర్థ్యకోర్సులో శిక్షణ ఇచ్చారు. వీరిని టి.ఓ.టి. (ట్రైనర్స్ ఆఫ్ ట్రైనీ)లుగా వ్యవహరిస్తారు. ప్రధానంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, సాధారణ పరిపాలన, పారిశుద్ధ్యం, తాగునీటి వనరులు, లేఅవుట్లు, భవన నిర్మాణాల ప్లాన్లు, పంచాయతీ ఆస్తులు, వీధి దీపాలు, విద్యుత్తు బిల్లులు, ఆర్థిక నిర్వహణ, కోర్టు కేసుల్లో న్యాయపరమైన అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పిస్తారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు విజ్ఞప్తి చేశారు.

రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య

- ఆధార్ తరహాలో జారీ
- వ్యవసాయ శాఖ సన్నాహాలు



న్యూస్‌టుడే, కాకినాడ నగరం

రాష్ట్రంలోని ప్రతీ రైతుకు ఒక యూనిక్ కోడ్ (యూసీ)ని కేటాయించే పనిలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఆధార్ తరహాలోనే ఈ గుర్తింపు సంఖ్య ఉంటుంది. కేంద్రం చేపట్టిన ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా రైతుల వివరాల నమోదుకు వ్యవసాయ శాఖ రంగంలోకి దిగింది. ఉమ్మడి జిల్లా పరిధిలో 6 లక్షల మందికిపైగా రైతులకు కార్డులందించాలని నిర్ణయించారు. వ్యవసాయ రంగం డిజిటలైజేషన్ లక్ష్యంతో రైతులకు ఇవ్వాలనుకున్న ఆధార్ తరహా విశిష్ట గుర్తింపు సంఖ్య జారీకి ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశవ్యాప్తంగా 5 కోట్ల మంది రైతులకు జారీచేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. రైతుల రిజిస్ట్రీ రూపొందించాక ఆధార్ తరహా ఐడీ కార్డులు అందిస్తారు. అక్టోబరు నుంచే కార్డుల జారీకి ఏర్పాట్లు చేయాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యవసాయ అధికారులు కార్యాచరణ రూపొందించారు.

ఇవీ లెక్కలు..

జిల్లా	రైతులు(లక్షల్లో)	కౌలుదారులు
తూర్పుగోదావరి	2.82	1.45
అంబేడ్కర్ కోనసీమ	2.62	2.20
కాకినాడ	2.20	1.76

బహుళ ప్రయోజనాలు..

రైతులకు యూనిక్ కోడ్ జారీతో బహుళ ప్రయోజనాలు కలగనున్నాయి. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే అన్ని పథకాలకు ఈ యూనిక్ కోడ్‌ని తప్పనిసరి చేయనున్నారు. పంటలకు కనీస మద్దతు ధర పొందేందుకు, మార్కెట్లలో సులువుగా విక్రయించుకునేందుకు ఈ సంఖ్య ఉపయోగపడనుంది. ఈ నంబరు సాయంతో కిసాన్ క్రెడిట్ కార్డును కూడా ఉపయోగించుకోవచ్చు. దేశంలో ఎక్కడి నుంచైనా ఈ సంఖ్య సాయంతో రుణ అర్హత వివరాలు, బకాయిలు వివరాలు, ప్రభుత్వ పథకాల జమ, తదితర వివరాలను వెంటనే తెలుసుకోవచ్చు.

అన్ని విధాలా మేలే..

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీతో అన్ని విధాలా మేలే జరుగుతుంది. ఈ సంఖ్యతో రైతుల వివరాల సేకరణ సులువుగా మారుతుంది. కేంద్ర, రాష్ట్ర పథకాల వర్తింపునకు దీన్ని ఆధారంగా చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ సంఖ్య జారీకి రాష్ట్రస్థాయిలో సన్నాహాలు జరుగుతున్నాయి. మార్గదర్శకాలు రాగానే మేమూ ఇందులో భాగస్వాములవుతాం.

– ఎన్.విజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ జేడీ


మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వరరావు

మహిళలకు ప్రత్యేక చట్టాలు

రామచంద్రపురం: మహిళల కోసం ఓటు హక్కు చట్టం, వినియోగదారుల చట్టం, ప్రామిసరీ నోటు పైన బాల్య వివాహాల పైన ఇలా ఎన్నో ప్రత్యేక చట్టాలున్నాయని సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా జడ్జి వెంకటేశ్వరరావు బాల్య విహాలు, ప్రామిసరీ నోట్లు పైన అవగాహన కల్పించారు. న్యాయవాదులు దొమ్మలపాటి సత్యనారాయణ, పీవీఎస్ జానకిలను న్యాయ సేవాధికార సంస్థ రిసోర్స్ పర్సన్‌లుగా నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ మంగాదేవి, డీఆర్డీఏ ఏపీఎం అర్జున, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో ఉన్నతాధికారులు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారిని అమరావతిలోని గవర్నర్ బంగ్లా రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాశ్ ఆదివారం కుటుంబ సభ్యులతో సహా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆశీర్వచనం గావించి శేషవస్త్రం కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి స్వామివారి జ్ఞాపికను ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాస్ అందజేశారు.


సూర్యప్రకాష్‌కు స్వామివారి జ్ఞాపిక అందజేస్తున్న అర్చకులు



దిండిలో పర్యాటకోత్సాహం

మలికిపురం: దసరా సెలవులు కావడంతో ఆదివారం దిండిలో పర్యాటకుల సందడి నెలకొంది. స్థానిక దిండి హరిత కోకోనట్ కంట్రీ రిసార్ట్సులో పర్యాటకులు ఉత్సాహంగా, సరదాగా గడిపారు. పిల్లలు రిసార్ట్సు ఆవరణలోని క్రీడోపకరణాలపై ఆటలాడి సందడి చేశారు.

స్వామీ.. నీ దర్శనానికి ఇన్ని విఘ్నాలా..

అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో భక్తుల వెతలు



ప్రసిద్ధి చెందిన అయినవిల్లి సిద్ధివినాయకస్వామిని నిత్యం వేలల్లో భక్తులు దర్శించుకుంటారు. ప్రత్యేక, పర్వదినాల్లో ఈ సంఖ్య మూడింతలు ఉంటుంది. ఏ శుభకార్యం తలపెట్టినా ముందుగా ఇక్కడికి రావడం ఆనవాయితీ. ఏటా వివిధ పూజా రుసుములు, హుండీలు, విరాళాల ద్వారా సుమారు రూ.4 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. ఇంత ఆదాయం వస్తున్నా ఆలయానికి వచ్చే భక్తులకు సరైన సౌకర్యాలు లేవని వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, అయినవిల్లి


అన్నదాన భవనం నిర్మాణానికి కొనుగోలు చేసిన స్థలంలో వాహనాల నిలిపివేత

స్వామివారి ప్రధాన ఆలయంలో పరిసరాలు ఇరుగ్గా మారడంతో దర్శనానికి గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి వస్తోంది. లోపల ప్రహరీని ఆనుకుని గతంలో నిర్మించిన బేడ మండపం ఎత్తుగా ఉండటంతో నిరుపయోగంగా మారింది. లక్ష్మీగణపతి హోమశాల ప్రత్యేక దినాల్లో భక్తులకు సరిపోని కారణంగా బయట నిల్చోవాల్సి వస్తోంది. ఉపాలయాలకు ఎదురుగా ఉన్న మండపం శిథిలావస్థకు చేరింది.

పార్కింగ్ సమస్య

స్వామివారి ఆలయం ప్రధాన రహదారికి ఆనుకుని ఉంది. ఇక్కడ పార్కింగ్ ప్రధాన సమస్యగా మారింది. నిత్యం వేలల్లో వచ్చే భక్తులు తమ ద్విచక్ర వాహనాలు, కార్లు ప్రధాన రహదారిపై నిలిపివేయడంతో తరచూ ట్రాఫిక్ అంతరాయాలు కలుగుతున్నాయి. కొత్త వాహనాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించే సమయంలో సైతం ఇదే పరిస్థితి. రహదారులను ఆక్రమించి చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసినా దేవస్థానం అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.


ఆలయం వద్ద ట్రాఫిక్ రద్దీ

శాశ్వత అన్నదాన భవనానికి భూమిపూజతో సరి

గతంలో కొనుగోలు చేసిన 30 సెంట్ల స్థలంలో రూ.5.35 కోట్లు వెచ్చించి శాశ్వత అన్నదాన భవనానికి భారీఎత్తున ఏర్పాట్లతో రెండేళ్ల క్రితం భూమిపూజ చేశారు. నిర్మాణానికి నేటివరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రస్తుతం ఉన్న భవనం, అక్కడ ఉన్న పాలకమండలి సమావేశ మందిరం తొలగిస్తే ఖాళీజాగా ఏర్పడుతుందని.. వాహనాల పూజలకు, పార్కింగ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు చేపడతామని అధికారులు అంటున్నారు.

ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం

పార్కింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ప్రధాన రహదారిలో చెరువుగట్టు వద్ద ఖాళీగా ఉన్న వ్యవసాయ భూమిని లీజుకు తీసుకొనే చర్యలు వేగవంతం చేస్తున్నాం. అన్నదాన భవనం నిర్మాణానికి మరోసారి టెండర్లు పిలుస్తాం. ఆలయ సమీపంలో ప్రయివేటు స్థలాలు, కొనుగోలు, లీజుకు తీసుకొనే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. దీంతో పార్కింగ్ సమస్య తీరుతుంది.

– ఎం.సత్యనారాయణరాజు, సహాయ కమిషనర్, సిద్ధివినాయక స్వామి దేవస్థానం


పుష్పగుచ్ఛం అందిస్తున్న సూరపరాజు

డీపీవో బాధ్యతల స్వీకరణ

అమలాపురం గ్రామీణం: జిల్లా పంచాయతీ అధికారిగా డి.శాంతలక్ష్మి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డీఎల్‌డీవోగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై జిల్లాకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌ఛార్జి డీపీవోగా పనిచేసిన డి.రాంబాబు తిరిగి డ్వామా ఏపీడీగా వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన శాంతలక్ష్మిని జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు ఆర్.ఎస్.ఎస్.సూరపరాజు, కార్యదర్శి ఎ.సాయిరాం, కో ఛైర్మన్ ఎ.శరభరాజు తదితరులు అభినందించారు.

నేటి నుంచి అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీలు

దివాన్‌చెరువు(రాజానగరం): దివాన్‌చెరువు శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఈ నెల 7 నుంచి ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ 2024-25 పోటీలు నిర్వహించనున్నామని తూర్పుగోదావరి జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అండర్-17 బాలుర విభాగంలో నిర్వహించే ఈ పోటీలు ఈ నెల 9 వరకు జరుగుతాయన్నారు.

8న టీటీడీసీలో ఉద్యోగ మేళా

సామర్లకోట: ఈ నెల 8న సామర్లకోట టీటీడీసీలో ఉద్యోగ మేళాను సీడాప్‌తో కలిసి నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండలరావు తెలిపారు. బ్లూఓషన్ బయోటెక్, పేటీఎం, ఇన్నోవ్‌సోర్స్, జీపే కంపెనీ ప్రతినిధులు ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, ఫిట్టర్, ఏదైనా డిగ్రీ చదివి 18 నుంచి 35 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో వివరాల నమోదు చేసుకుని 8న మేళాకు తగిన పత్రాలతో హాజరుకావాలన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

ఆడబిడ్డకు ఎంత కష్టం వచ్చిందో..


చెత్తకుప్పలో శిశువు మృతదేహం లభ్యం

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఏ తల్లి కన్నదో.. పుట్టగానే చనిపోయిందో లేక బతికుండగానే తెచ్చి పడేస్తే ప్రాణాలు వదిలిందో తెలియదు.. అభంశుభం తెలియని నెలల శిశువు చెత్తకుప్పలో మృతదేహంగా కనిపించడం స్థానికులను కలచివేసింది. తుమ్మలోవ ప్రాంతంలోని జయరామ్ థియేటర్ సమీపంలో రోడ్డు పక్కన ఆదివారం ఉదయం చెత్తకుప్పలో ఈ దృశ్యం కనిపించింది. ఈగలు వాలుతూ ఓ మాంసం ముద్దలా ఉన్న ఆకారాన్ని కుక్కలు లాగబోతుంటే స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఆడశిశువు మృతదేహంగా గుర్తించి ప్రభుత్వాసుపత్రి శవాగారానికి తరలించారు. ఇంకా బొడ్డుతాడు కూడా తీయని శిశువు మృతి చెందితే అక్కడ పడేశారా.. ఆడబిడ్డ అని తెలిసి బతికుండగానే ఈ ఘాతుకానికి పాల్పడ్డారో విచారణలో తెలియాల్సి ఉందని రాజమహేంద్రవరం మూడో పట్టణ సీఐ వి.అప్పారావు తెలిపారు.

భార్యాపిల్లల ముందే నరికేశాడు

ఆస్తి వివాదంలో అన్న చేతిలో తమ్ముడి హత్య

తాళ్లరేవు: ఆస్తి వివాదం ఉన్మాదిలా మార్చేసింది. తోడబుట్టిన తమ్ముడినే కత్తితో కడతేర్చేలా చేసింది. తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ హత్యకు దారితీసింది. కోరింగ ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. వెంటపల్లి నూకరాజు ఇంటిదగ్గర కొబ్బరితోటలో ఆదివారం ఉదయం కొబ్బరి దింపుతుండగా అతడి అన్న ఏడుకొండలు అక్కడికి వెళ్లాడు. తోటలో తనకూ వాటా ఉందనడంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం సాగింది. ఇంతలో ఏడుకొండలు కత్తితో నూకరాజుపై దాడిచేశాడు. అతడు కింద పడటంతో మరో నాలుగుచోట్ల నరకడంతో నూకరాజు(44) అక్కడికక్కడే మృతిచెందాడు. కొబ్బరికాయలు దింపు తీసేందుకు వచ్చిన రెడ్డి రామకృష్ణపై సైతం దాడి చేసేందుకు ప్రయత్నించగా అతడు తప్పించుకున్నాడు. దీంతో అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుడి భార్య నాగరత్నం, తొమ్మిదేళ్ల కుమారుడు, అయిదేళ్ల కుమార్తె కళ్లెదుటే హత్య జరగడంతో వారంతా షాక్‌కు గురయ్యారు. పోలీసులు వివరాలు సేకరించారు. ఇల్లు, కొబ్బరితోట వివాదం కోర్టులో ఉందని, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.


మృతుడి భార్య, పిల్లలు


నూకరాజు (పాత చిత్రం)

అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్ విశాఖ

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం కైవసం చేసుకుంది. వరుసగా బాలురు, బాలికల ఛాంపియన్‌షిప్‌ను కూడా కైవసం చేసుకొని అన్నింటా విజయకేతనం ఎగురవేసింది. ఇక వ్యక్తిగత బాలుర విభాగంలో దుడ్డు శేషు (విశాఖ), ఎస్కే రోషన్ (గుంటూరు) కైవసం చేసుకోగా.. బాలికల విభాగంలో ఎల్.డింపుల్ మహశ్రీ (ఏలూరు), బాకి శైలజ (విశాఖ), పి.వసంత (విజయనగరం) కైవసం చేసుకున్నారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో విజేతలను సంఘ సభ్యులు ఎన్.శివకుమార్ తదితరులు అభినందించారు.


బహుమతులు అందుకున్న క్రీడాకారిణులతో నిర్వాహకులు

జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటాలి

రాజానగరం: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సీబీఎస్ఈ క్లస్టర్-7 పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు మరింత నైపుణ్యం, ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రాణించాలని హెక్సావేర్ వైస్ ప్రెసిడెంట్ వినోద్‌వర్మ ఆకాంక్షించారు. రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువు శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలుర వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విజేతలకు బహుమతులు అందజేశారు. మరో ముఖ్యఅతిథి, శ్రీప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ మాట్లాడుతూ విజేతలు ఈ నెల 21న హిమాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వై.వెంకట్, విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు ఎస్.గంగాధర్, పరిశీలకుడు పి.కిశోర్‌బాబు, ప్రిన్సిపల్ విమల, మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



అండర్-17 విభాగంలో విజేతలు, ముఖ్యఅతిథులు

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

నేడు కొత్తపేటలో ప్రజా దర్బార్

కొత్తపేట, న్యూస్‌టుడే: కొత్తపేట పంచాయతీ కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసు కువెళ్లి పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యేను కలిసిన మార్క్‌ఫెడ్ డైరెక్టర్

మలికిపురం, న్యూస్‌టుడే: మార్క్‌ఫెడ్ డైరెక్టరుగా బాధ్యతలు చేపట్టిన గుండుబోగుల పెద్దకాపు ఆదివారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను విశ్వేశ్వరా యపురంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూ ర్వకంగా కలిశారు. తనకు రాష్ట్ర డైరెక్టరు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే దేవ వరప్రసా దుకు కృతజ్ఞతలు తెలియజేసి సత్కరించారు.

నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట

కొత్తపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్దపీట వేస్తామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం వాడపాలెంలో పలు సిమెంటు రహదారుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం అంధకారంలో గడిపోయింది, వైకాపా ప్రభుత్వం అభివృద్ధి మాటే మరిచిందన్నారు. నియోజకవర్గాన్ని అభి వృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన తెలిపారు. కురువెళ్ల శ్రీనివాస రావు, త్సాహుబాబు, ములితాత, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సత్యానందరావు

మేమున్నాం.. మీకు తోడుగా

గుర్రపుడెక్క తొలగింపు



మలికిపురం: మండలంలోని శేషాచాయుడు, మలికిపురం పంట కాలువల్లో గుర్రపు డెక్క, పూడికలు కారణంగా నీటి పారుదల సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని జలవనరుల శాఖ ఏఈ రమేష్‌బాబు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బంది ఆధ్వర్యంలో కాలువల్లో గుర్రపు డెక్క, పూడి కలు జేసీబీతో తొలగించి నీటి పారుదలకు అడ్డంకులు తొలగించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

ఆత్మీయంగా కలిసి.. ఆనందంతో మెరిసి

మామిడికుదురు, న్యూస్‌టుడే: అప్పనపల్లి బాలబాలాజీస్వామి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998-2003లో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు 22 సంవత్సరాల తరువాత ఆదివారం ఆత్మీయంగా కలిసి ఆనందోత్సాహాలు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ముగ్గురు పూర్వ విద్యార్థులకు రూ.1.20 లక్షలు సాయంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు బీహెచ్ సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



అప్పనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

నిర్మాణం.. అయిదేళ్ల నిర్లక్ష్యం

25 గ్రామాల్లో తాగునీటి సమస్యలు

-న్యూస్‌టుడే, రాజోలు, మామిడికుదురు

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగు నీటి అవసరాలు తీర్చాలని, ప్రతి కుటుంబానికి రోజుకు 220 లీటర్ల నీటిని అందించాలని, ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలన్న సంకల్పం గత వైకాపా పాలనలో చాలా వరకు నిరుగారిపోయింది. జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులను పట్టించుకోకపోవడంతో సకాలంలో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు పూర్తికాక ఎక్కడికక్కడే నిలిచిపోవడం, కొన్నిచోట్ల నత్తనడకన సాగడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు ప్రతి మింపుతున్నాయి.

ట్యాంకుల పరిస్థితి ఇదీ..

రాజోలు నియోజకవర్గంలోని రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో గత ఏడాది కొత్తగా 46 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టగా 21 పూర్తయ్యాయి. మిగతా 25 చోట్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండిపోయాయి. రాజోలు మండలంలోని బి.సావరం, పొదలాడ, పొన్నమండ, కడలి, చింతలపల్లి, వేగివారి పాలెంలో, మలికిపురం మండలం తూర్పు పాలెం, బట్టేలంక, అడవిపాలెం, టి.సావరం, మట్టపర్రు, విశ్వేశ్వరాయపురం, శంకరగుప్తం, సఖినేటిపల్లి మండలంలో మోరిపోడు, కేశవదాసుపాలెం, గొందిలో ట్యాంకుల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. మామిడికుదురు మండలంలో మొత్తం 26 కొత్త ట్యాంకులకుగాను 8 చోట్ల పనులు పూర్తికాగా 11 చోట్ల వివిధ దశల్లో మందకొడిగా సాగుతున్నాయి. పెదపట్నంలో, ఈదరాడలో ఇంకా పునాది దశలోనే ఉన్నాయి. మొగలికుదురులో రెండు చోట్ల ఇంకా స్థలాలు సేకరించలేదు. అయిదు చోట్ల పనులు చేపట్టకపోవడంతో కాలయాపన జరుగుతోంది. లూటుకుర్రులో రూ.47.35 లక్షల వ్యయంతో చేపట్టిన మంచినీటి సంప్ విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో ఏడాది నుంచి నిరుపయోగంగా ఉంది. గత జనవరి నాటికి పూర్తి కావాల్సిన ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు నిధులు అందకపోవడంతో ఇలా నీరుగారిపోతున్నాయి. ఇవి ఎప్పటికి పూర్తి అవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. రాజోలు నియోజకవర్గంలో నాలుగు మండలాల పరిధిలో దాదాపు రూ.9 కోట్ల వరకు నిధులు నిలిచిపోయినట్లు సమాచారం. వీటికి గత జనవరిలో బిల్లులు పంపినా ఇప్పటికీ అతీగతీ లేదు.



కడలిలో నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు



లూటుకుర్రులో నిరుపయోగంగా తాగునీటి సంప్

వేగవంతంగా పనులు పూర్తి..

రాజోలు నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు కార్యాచరణ చేస్తాం. నిధుల విడుదల ఆలస్యమైనందున ఈ పరిస్థితి ఏర్పడింది. వీటిని డిసెంబరు నాటికి పూర్తి చేసేందుకు దృష్టి పెట్టాం. ఎక్కడా తాగు నీటి ఇబ్బందులు రానీయకుండా చర్యలు తీసు కుంటాం. - ఏవీఎస్ రాజన్, డీఈఈ, రాజోలు

విద్యుత్తు డీఈఈ చిట్టిరాజు బాధ్యతల స్వీకరణ



కొత్తపేట న్యూస్‌టుడే: కొత్తపేట సబ్ డివిజన్ విద్యుత్తు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు డి. చిట్టి రాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాలకు సబ్ డివిజినల్ అధికారిగా విధులు నిర్వర్తిస్తారు. ఆయన కోరుకొండ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

అంతర్వేదిలో పోటెత్తిన భక్త జనం

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనర సింహస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. దసరా సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ముందుగా వశిష్ఠ గోదావరి ఘాట్‌లో, సముద్రంలో స్నానాలు చేశారు. అనంతరం లక్ష్మీ నరసింహుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వశిష్ఠ ఘాట్‌లో స్నానాలు చేయడానికి ఇబ్బందిగా ఉందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘాట్ లోపల పగిలిన సీసాలు, నాచు ఎక్కువగా ఉండటంతో జారి పడటంతో కాళ్లకు గాయాలవుతున్నాయని వాపోయారు. ఘాట్‌ను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ప్రణీత్‌వర్మ



ఆత్రేయపురం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీల జట్టులో ఆత్రేయపురానికి చెందిన ముదునూరి ప్రణీత్‌వర్మకు స్థానం లభించింది. అక్టోబరు 10 వరకు ఉత్తరప్రదేశ్‌లోని మోదీ నగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొనున్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావు పేటలోని ప్రకాష్‌నగర్ విద్యానికేతన్‌లో ఇంటర్ చదువుతున్న వర్మను ఆత్రేయపురం గ్రామస్థులతో పాటు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి వనిత తదితరులు అభినందించారు.

'రివ్యూ పిటిషన్ తోసిపుచ్చడం సమంజసంకాదు'

రాజోలు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో వేసిన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చడం సమంజసం కాదని రాజోలు మండల జేఏసీ నాయకులు అన్నారు. రాజోలు అంబేడ్కర్ సామాజిక భవనంలో మాలల న్యాయపోరాట సమితి జేఏసీ అధ్యక్షుడు మట్టా సురేష్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. నాలుగు మండలాల జేఏసీల గౌరవాధ్యక్షుడు విప్పర్తి సాయిబాబు మాట్లాడుతూ దీనిపై న్యాయ పోరాటం చేయడానికి మాలలంతా ముందుకు రావాలన్నారు. లిఖితపూడి బుజ్జి, మందపాటి మధు, బత్తుల మురళీకృష్ణ, జనార్దనరావు, కొల్లాబత్తుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

లక్కవరంలో ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచండి

మలికిపురం, న్యూస్‌టుడే: లక్కవరం విద్యుత్తు సబ్ స్టేషనులో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన విద్యుత్తు సరఫరా చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విద్యుత్తు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సబ్ స్టేషనులో కాలిపోయిన 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేశారు. శనివారం సబ్‌స్టేషను పరిధిలో సాంకేతిక లోపం కారణంగా ఎక్కువ సమయం విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సబ్ స్టేషనుకు వెళ్లి అక్కడి పరిస్థితిపై విద్యుత్తు ఏడీఈ శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి ఏఈ బి.ప్రసాద్‌లతో సమీక్షించారు. గుడిమెళ్లంక, గుడిమూలలో మంజూరైన విద్యుత్తు సబ్‌స్టేషన్ల పనులు వెంటనే ప్రారంభించాలని ఫోన్‌లో సీఎండీ దృష్టికి తీసుకువెళ్లారు. లక్కవరంలో నెల రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి సీఎండీ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, రాము, మార్క్‌ఫెడ్ డైరెక్టరు గుండుబోగుల పెద్దకాపు, సర్పంచి కోట పుష్పకుమారి, గెడ్డం మహాలక్ష్మీప్రసాద్, గుబ్బల ఫణికుమార్, మల్లిపూడి సత్తిబాబు, ఆరేటి రంగనాయకులు, బోణం చంటి తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

ఆర్థిక సాయం అందజేత

మలికిపురం: అనారోగ్యంతో బాధపడుతున్న రామరాజులంకకు చెందిన పోతుల పుల్లారావుకు గ్రామంలో దాతలు సమకూర్చిన రూ.61 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అందజేశారు. స్థానిక ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, ముద్దల శ్రీను, దేశినీడి తాతాజీ, బొరుసు ఉమారావు, మేడిచర్ల సూర్యప్రకాశరావు, మేడిచర్ల అబ్బులు, రామరాజులంక యువకులు పాల్గొన్నారు.

కన్వీనర్‌ను తొలగించాలని శ్రేణుల నిరసన

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన తెదేపా శ్రేణుల సమావేశంలో అంబాజీపేట మండల సీనియర్ నాయకుడు, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి గూడాల ఫణిపై నియోజకవర్గ తెదేపా కన్వీనర్ నామన రాంబాబు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పార్టీ శ్రేణులు ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశాయి. ఆయన్ని కన్వీనర్ పదవి నుంచి తొలగించాల్సిందేనని కార్యకర్తలు మూకుమ్మడిగా తీర్మానం చేశారు. వివరాలిలా ఉన్నాయి. పి.గన్నవరంలో ఇటీవల పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా సభలో మండల ప్రధాన కార్యదర్శి ఫణిపై నామన రాంబాబు ఆగ్రహంతో మాట్లాడంపై శ్రేణులంతా సమావేశమై చర్చించారు. అయినవిల్లి మండలంతోపాటు ఇతర చోట్ల నామన వ్యవహరించిన తీరును ఎండగట్టారు. పలువురు సీనియర్ కార్యకర్తలు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి జెండా మోస్తున్న కార్యకర్తలను అవమానించేలా రాంబాబు మాట్లాడటం దారుణమన్నారు. పార్టీ శ్రేణుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తిస్తున్న రాంబాబును నియోజకవర్గ కన్వీనర్‌గా తొలగించి, మరొకరిని నియమించాలని కోరుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, సీఎం చంద్రబాబులకు లేఖలు పంపామన్నారు. ఈ విషయంలో ఓ నిర్ణయం వచ్చే వరకు తెదేపా సభ్యత్వాలు చేసేది లేదని వారు తెలిపారు.



తెదేపా కార్యకర్తలను కాపాడాలంటూ ప్లకార్డులతో శ్రేణుల నిరసన



రావులపాలెంలో కనకదుర్గమ్మ



బోడిపాలెం వంతెన వద్ద దుర్గమ్మ



పెదపళ్లలో లలితాత్రిపురసుందరిగా..



అంబాజీపేటలో విజయకనకదుర్గమ్మ



తాటికాయలవారిపాలెంలో కనకదుర్గ ఆలయం వద్ద పూజలు

జగజ్జనని.. విశ్వరూపిణి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు, లలితాపారాయణం చేశారు. పలు ఆలయాల వద్ద హోమాలు నిర్వహించారు. ఆలయాలు విద్యుద్దీపాలంకరణలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. పలు ఆలయాల్లో అమ్మవారిని లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

\- న్యూస్‌టుడే, బృందం



సిరిపల్లిలో విజయదుర్గ

సిద్ధివినాయకస్వామిని దర్శించుకున్న అధికారులు

అయినవిల్లి, న్యూస్‌టుడే: సిద్ధివినాయకస్వామివారిని ఆదివారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు దంపతులు, రాజమహేంద్రవరం ఈపీఎఫ్ జేసీ వైడీ ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు వినాయకరావు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



నగరంలో సీఎం, ఉప ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కౌలు రైతులు

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మామిడికుదురు, న్యూస్‌టుడే: సార్వా ధాన్యాన్ని తమకు నచ్చిన మిల్లులకే అమ్ముకునేలా వెసులుబాటు కల్పించినందుకు కౌలు రైతులు నగరంలో ఆదివారం హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. స్థానిక గుర్రాలచెరువు సమీపంలో పంట చేల వద్ద పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. గత ధాన్యం బకాయిలను చెల్లించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, స్థానికులు జాలెం సుబ్బారావు, ముకరమ్‌హుస్సేన్, తాటికాయల ఉదయభాస్కరరావు, రాయుడు ఆనందరావు, షాదిక్, ఎం. కె. అబ్బాస్, కోళ్ల సురేష్, మొల్లేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ

అంబాజీపేట: మాచవరం, కె. పెదపూడి, పుల్లేటికుర్రు, తొండవరం గ్రామ పంచాయతీలకు బదిలీపై వచ్చిన కార్యదర్శులు ఆదివారం బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో జి.సరోవర్ ఆదివారం తెలిపారు. అల్లవరం నుంచి మాచవరానికి కె.వి.వి.సత్యనారాయణ, పి.గన్నవరం మండలం నుంచి కె. పెదపూడికి బి.అప్పారావు, ఇదే మండలం నుంచి పుల్లేటికుర్రుకు వి.లక్ష్మీపతి, కొత్తపేట మండలం నుంచి తొండవరం పంచాయతీకి డి.వరలక్ష్మి బదిలీ అయ్యారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా ఏపీఎల్ నరసింహం, సీనియర్ అసిస్టెంట్‌గా వి.వి.గిరిబాబు, టైపిస్టుగా కె.వి.ఎస్.బలదీప్ బాధ్యతలు చేపట్టారు.

భాజపా యువ మోర్చా అధ్యక్షుడికి ఘన స్వాగతం

రావులపాలెం పట్టణం: భాజపా యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్లా వంశీకృష్ణ జిల్లా పర్యటనలో భాగంగా రావులపాలెం రావడంతో నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘన స్వాగతం పలికారు. యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్‌నారాయణ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. ఈశ్వరగౌడ్, చిన్నారి, అరవింద్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



తెదేపా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అనంతకుమారి

తెదేపాలోకి పద్మరాజు

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: గుడిమూల పీఏసీఎస్ అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు రుద్రరాజు పద్మరాజు ఆదివారం తెదేపాలో చేరారు. వీరిని తెదేపా జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి తన నివాసంలో తెదేపా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. రాష్ట్ర, నియోజకవర్గ తెదేపా నాయకులు పాల్గొన్నారు.

వడ్రంగం కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

అయినవిల్లి, న్యూస్‌టుడే: వడ్రంగం కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా దేవాదుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి కోరారు. ఆదివారం ముక్తేశ్వరంలో జరిగిన వడ్రంగం కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టింబర్ డిపోల్లో రెడీమేడ్ గుమ్మాలు, కిటికీలు తయారు చేసి అమ్మకాలు చేయడం, ఇసుక కొరత కారణంగా పనుల్లేకపోవడంతో ఈ వృత్తిపై ఆధారపడి బతుకుతున్న అనేక మంది వడ్రంగులకు ఉపాధి లేక కుటుంబ పోషణ కష్టతరంగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. షణ్ముఖచార్యులు, భీమశంకరం తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి మృతి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. అంకంపాలెం గ్రామానికి చెందిన కరపోతు లక్ష్మి ప్రవీణ్ అజయ్(22) తాపీ పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. జీవితం మీద విరక్తి చెంది గత నెల 25న పురుగు మందు తాగారు. స్థానికులు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

ఆలమూరు, న్యూస్‌టుడే: చొప్పెల్ల లాకుల వద్ద ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని మహిళ మృతదేహం కొట్టుకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు గల మహిళ మృతదేహం లాకుల వద్ద కాలువలో చెట్టు కొమ్మలు అడ్డుపడి ఆగడంతో స్థానికులు చూసి వీఆర్వోకు సమాచారం ఇచ్చారు. ఆయన ఆలమూరు పోలీసులకు విషయం చెప్పడంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మహిళ మృతదేహాన్ని గుర్తించి, కేసు నమోదు చేసినట్లు ఆలమూరు పోలీసులు తెలిపారు.

మండల పరిషత్తు సమావేశాలు నేడు

అంబాజీపేట, మలికిపురం, న్యూస్‌టుడే: అంబాజీపేట, మలికిపురం మండల పరిషత్తు సమావేశాలు సోమవారం ఆయా మండల కార్యాలయాల్లో సోమవారం నిర్వహించనున్నారు.

వివాదంలో రెండు వర్గాలపై కేసులు

ఆత్రేయపురం: సరిహద్దు వివాదంలో రెండు వర్గాల ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామానికి చెందిన చిట్టిమేను వెంకటేష్ మేకలను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఇంటి పక్కన బంధువైన చిట్టిమేను రామకృష్ణతో సరిహద్దు వివాదంలో ఈ నెల 3న వెంకటేష్‌ను కర్రతో కొట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. కొత్తపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం కేసు నమోదు చేశామన్నారు.

అక్రమ మద్యం కేసులో వ్యక్తి అరెస్టు

పి.గన్నవరం: యానాం నుంచి అక్రమంగా మద్యం సీసాలు తీసుకొచ్చి విక్రయిస్తున్న లంకలగన్నవరానికి చెందిన మల్లాడి కల్యాణరాజును ఆదివారం అరెస్టు చేశామని ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. 42 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నాటుసారా స్వాధీనం

ఆలమూరు: బడుగువానిలంకలో ఆదివారం ఆలమూరు ఎస్సై అశోక్ తదితరులు దాడి చేసి జానా చినసత్యనారాయణ వద్ద పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఆలమూరు పోలీసులు తెలిపారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

వీరేశ్వరస్వామి ఆలయంలో అహోరాత్ర పారాయణ

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 9న అహోరాత్ర పరాయణ నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున కలశస్థాపనతో ప్రారంభించి 24 గంటల పాటు మహిళలు లలిత పారాయణ నిర్వహిస్తారని చెప్పారు. హిందూ ధర్మప్రచార కార్యక్రమంలో భాగంగా తలపెట్టిన కార్యక్రమంలో భక్తులంతా పాల్గొన్నాలని ఆయన కోరారు.

గడువులోగా దరఖాస్తు చేయాలి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నూతన మద్యం పాలసీ విధానంలో ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణకు ఆసక్తి ఉన్నవారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. స్టేషన్ పరిధిలోని ముమ్మిడివరం, ఐ.పోలవరం కాట్రేనికోన మండలాలకు సంబంధించి 13 మద్యం దుకాణాలు ఉండగా.. వాటికి ఇప్పటి వరకు 22 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆశావహులు దరఖాస్తులు చేసుకోవాలని సీఐ సూచించారు. ఈ నెల 11వ తేదీన అమలాపురం కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలు కేటాయించనున్నట్లు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: అమలాపురం శ్రీరామపురం రోడ్డులో నిర్మాణ వ్యర్థాలను పడేయడంతో అటుగా వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. –దొరబాబు, వ్యాపారి

సమస్య: సూర్యనగర్ రోడ్డులో చెట్లకొమ్మలను పడేయడంతో క్రిమి కీటకాలు పెరిగిపోయాయి. వీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలి. –సూర్య

సమస్య: ముద్దాలవారిపేట శివారు మురుగుకాలువపై చెత్తను వేయడంతో మురుగు ముందుకు కదలడం లేదు. – హరీష్, స్థానికుడు

పరిష్కారం: శ్రీరామపురం, సూర్యనగర్ రోడ్డు, ముద్దాలవారిపేట శివారు సమస్యలను సంబంధిత వార్డుల సచివాలయ కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందితో వాటిని తొలగింపజేశారు.

వీధిదీపాలకు మరమ్మతులు

సమస్య: బ్రహ్మసమేధ్యం పంచాయతీ పరిధిలోని కొత్తపాలెంలో వీధిదీపాలు వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టాలి. –స్థానికులు

పరిష్కారం: సమస్యను పంచాయతీ సర్పంచి ఏడుకొండలు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో వీధిదీపాలకు అవసరమైన మరమ్మతులు చేయించారు.

బ్లీచింగ్ చల్లించారు

సమస్య: కాట్రేనికోనలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. –గ్రామస్థులు

పరిష్కారం: ఈ సమస్యను సర్పంచి సుధాకర్‌కు తెలుపగా స్పందించారు. సిబ్బందితో పరిసరాల్లో బ్లీచింగ్ చల్లించారు. –న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం, కాట్రేనికోన

సమస్య: అల్లవరం పంచాయతీ పరిధిలో గోసంగివారి పేటలో నివాసాల చెంత మురుగు నీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా వ్యాపిస్తున్నాయి. పలువురు జ్వరాల బారిన పడుతున్నారు.

పరిష్కారం: ఈ సమస్యను సర్పంచి బొమ్ము బాలవేణి, కార్యదర్శి రాజ్‌మోహన్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన వారు పంచాయతీ సిబ్బందిచే పరిసరాలను శుభ్రం చేయించి, దోమల మందు పిచికారి చేయించారు.

సమస్య: బోడసకుర్రు పంచాయతీ పరిధిలో పల్లిపాలెం ప్రాంతంలో నివాసాల వద్ద వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది.

పరిష్కారం: ఈ సమస్యను సర్పంచి విజయలక్ష్మి, కార్యదర్శి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. – అల్లవరం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: 79939 35935, ముమ్మిడివరం: 80085 74166

మారని తీరు.. తీరని దాహం



హౌసింగ్‌బోర్డుకాలనీలో మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

జిల్లా కేంద్రం అమలాపురం పట్టణ ప్రజలను తాగునీటి వెతలు వీడటం లేదు. మంచినీటి చెరువులు అందుబాటులో ఉన్నా దాహం తీరడం లేదు. వైకాపా పాలనలో పట్టణంలో తరచూ తాగునీటి కొళాయిల ద్వారా రంగుమారిన, మురికినీళ్లు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేయడం పరిపాటిగా మారింది. అప్పటి మంత్రి విశ్వరూప్ రూ.20 కోట్లతో మూడు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, కొత్త పైపులైన్ కోసం శంకుస్థాపన చేసినా గాంధీనగర్‌లో తప్ప ఆ పనులు ప్రారంభించలేదు.

అమలాపురం పట్టణ జనాభా.. తాగునీరు	
వార్డులు	: 30
జనాభా	: 65,000 మంది
తాగునీటి రిజర్వాయర్‌లు: 3	
అవసరమైన నీరు	: 6.5 ఎంఎల్‌డీ
ప్రస్తుతం సరఫరా	: 5 ఎంఎల్‌డీ
పైపులైన్ పొడవు	: 120.68 కి.మి
విస్తరించాల్సింది	: 20 కి.మి.
కొళాయిలు	: 6,500 కనెక్షన్లు
పబ్లిక్ కొళాయిలు	: 400

పైపులైన్లు అస్తవ్యస్తం..

కాలం చెల్లిన మంచినీటి పైపులైన్ వ్యవస్థ వల్ల ఎక్కడ పడితే అక్కడ నీరు లీకై రహదారులపై ప్రవహిస్తోంది. మురుగు కాలువలలో మంచినీటి పైపులైన్లు వేయడం వల్ల మురుగుతో కలిసి కొళాయిల్లో వచ్చే నీరు కలుషితమవుతోంది. ఆ నీరు తాగడం, వాడటం వల్ల చర్మ సమస్యలు, దద్దుర్లు వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీటిని తాగిన జనం టైఫాయిడ్, డయేరియా తదితర వ్యాధుల బారిన పడుతున్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో..

హౌసింగ్‌బోర్డు కాలనీలో కొళాయి నుంచి రంగుమారిన, బురద నీరు వస్తోందని ఫిర్యాదులు అందుతున్నాయి. మురుగు కాలువలలో మంచినీటి పైపులైన్ ఉండటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు. ఇక్కడి సమస్యపై సిబ్బంది వచ్చి పరిశీలిస్తున్నా పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. మంచినీటి ట్యాంకర్ రావడం లేదని తెలిపారు. ఈ ప్రాంతంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభించలేదు.



చిన్నవంతెన కింద మంచినీటి పైపులైన్ పరిస్థితి



గడియారస్తంభం పక్కన తీసిన గొయ్యి

త్వరలో చర్యలు తీసుకుంటాం

రూ.20 కోట్లతో మూడు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, రూ.9 కోట్లతో మంచినీటి పైపులైన్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. గతంలో రూ.28 లక్షలతో మంచినీటి పైపులైన్ వేయించాం. మున్సిపల్ కౌన్సిల్ ఆమోదిస్తే త్వరలో చర్యలు తీసుకుంటాం.
–భాస్కరరావు, మంచినీటి విభాగ ఏఈ



మొక్కలను అందజేస్తున్న సత్యవరప్రసాద్

మొక్కలు నాటాలి

అమలాపురం పట్టణం: పురుగు మందులు లేకుండా పండించే కూరగాయలు తినాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ కోరారు. అమలాపురంలోని వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఔత్సాహికులకు మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో జవ్వాది తాతాబాబు, తిక్కా వేణు, గోకరకొండ నాగేంద్ర, శర్మ, పద్మావతి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అల్లవరం, న్యూస్‌టుడే: అల్లవరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొంటారని అధికారులు తెలిపారు.

విగ్రహప్రతిష్ఠాపన పూజలు

కాట్రేనికోన: చింతలమెరకలో నూతన ఆలయంలో విజయలక్ష్మిదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు సుదర్శనం వెంకట జనార్దనాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు.

అమ్మవార్లకు పూజలు



శ్రీదేవి ఆలయంలో ఎమ్మెల్యే చినరాజప్ప పూజలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: విజయదశమి ఉత్సవాల సందర్భంగా అమలాపురంలోని శ్రీదేవి, వాసవీమాత అమ్మవార్లకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం రాత్రి పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. ఆశెట్టి ఆదిబాబు, మండేల బాబి, నంబూరి సత్యనారాయణమూర్తి, కొమ్మూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం మండలం బండారులంకలోని సర్పంచి పెనుమాల సునీత అధ్యక్షతన వివిధ అభివృద్ధి పనులకు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో కలిసి ఆదివారం శంకుస్థాపనలు చేశారు. గ్రామంలోని సిమెంటు రహదారులు, మురుగుకాలువల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయడంతో పాటు పలు అభివృద్ధి పనులపై స్థానికులతో చర్చించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, మాజీ ఎంపీటీసీ మాడా మాధవి, లింగోలు పండు తదితరులు పాల్గొన్నారు.



రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం పట్టణం: చిత్రలేఖనంపై విద్యార్థులు ఆసక్తి చూపడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే అయితాబత్తుల అనందరావు అన్నారు. ప్రముఖ చిత్రకారుడు ఉండ్రు ఆశీర్వాదం ఆధ్వర్యంలో అమలాపురంలోని వేడుకమందిరంలో గురుపూజోత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు 75 మంది చిత్రలేఖనోపాధ్యాయులను సన్మానించారు. అకొండి అంజీ, మాడా రాము, సత్యనారాయణ, పాదా రామకృష్ణ, బత్తుల శ్రీను, గిడ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు తీగలు సరిచేశారు

'ఈనాడు' కథనానికి స్పందన



ఉప్పలగుప్తం గ్రామం గొంగూర చెరువుగట్టు కాలనీకి వెళ్లే దారిలో స్తంభం విరిగిపోవడంతో విద్యుత్తు తీగలు పంటబోదేలో ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఇక్కడి పరిస్థితిపై గత నెల 4న 'ఈనాడు'లో చిత్రకథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన విద్యుత్తు సిబ్బంది శనివారం స్తంభం వేసి తీగలు సరిచేశారు.

–న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

హిందూ ధర్మ రక్షణకు నడుంబిగించాలి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: హిందూ ధర్మాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ నడుంబిగించాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర ధర్మ ప్రచారకులు ముద్దు సాయిరాం అన్నారు. ముమ్మిడివరంలోని కేశవస్వామి ఆలయంలో సమరత సేవా పౌండేషన్ గ్రామ కన్వీనర్లు, సహ కన్వీనర్లకు ఆదివారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో సాయిరాం మాట్లాడారు. హిందూ ధర్మాన్ని రక్షించుకుంటేనే దేశం, సమాజం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో సమరత సేవా ఫౌండేషన్ గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ జగన్నాథరావు, ముమ్మిడివరం సబ్ డివిజన్ కన్వీనర్లు సానబోయిన వీరభద్రరావు, గొలకోటి సాయిబాబు, తాడి నరసింహారావు, కుక్కల ధర్మరాజు, చింతా వివేక్, అనూష, నల్లా ఆండాళ్‌దేవి, శీలం లంకేశ్వరుడు, బొంతు కనకారావు, కొయ్యల దుర్గారావు, యనమదల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో సమరత సేవా ఫౌండేషన్ గ్రామ కన్వీనర్లు, సహ కన్వీనర్లు



అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అన్నపూర్ణాదేవిగా శ్రీవైష్ణవి కనకదుర్గ అమ్మవారు ★ భవానినగర్ కల్యాణదుర్గ అమ్మవారు ★ కల్వకొలను వీధిలోని వేపచెట్టు అమ్మవారు ★ లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో బాలా త్రిపుర సుందరి అమ్మవారు ★ యానాం గోపాల్‌నగర్‌లో ★ చినబొడ్డువెంకటాయపాలెంలో దుర్గాదేవి ★ చినకొత్తలంకలోని అమ్మవారిని ఐదు వేల గాజులతో అలంకరణ ఇలా ★ కుండలేశ్వరాలయంలో అలంకరణలో అమ్మవారు ★ ప్రత్యేకాలంకరణలో మరిడిమహాలక్ష్మి

జగజ్జననీ.. అభయప్రదాయిని

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: విజయదశమి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో పలు ఆలయాలలో అమ్మవార్లు ఆదివారం అన్నపూర్ణాదేవి, లలితా త్రిపుర సుందరి రూపాల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాల వద్ద లలితా సహస్రనామ పారాయణం, కుంకుమపూజలు, యాగాలు, హోమాలు చేశారు. అమ్మవార్ల ఆలయ ప్రాంగణాలలో జరిగిన అన్నసమారాధనలో భక్తులు ప్రసాదం స్వీకరించారు.

★ యానాంలోని గోపాల్, రాధానగర్, గాంధీనగర్, శ్రీరామనగర్, సాయిరామ్ నగర్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శ్రీ శారదాదేవిని ఆదివారం రాజమాతాంగి అమ్మవారిగా అలంకరించారు. పడవలరేవు వీధిలో లలితాదేవి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాళ్లరేవు మండలం పాతకోరంగిలో బాలా త్రిపుర సుందరి, చినబొడ్డువెంకటాయపాలెంలో దుర్గా దేవి అవతారంలో లలితా త్రిపుర సుందరీదేవి ఆదివారం దర్శనమిచ్చారు. కాట్రేనికోన మండల వ్యాప్తంగా ఆలయాలు, మండపాల్లో పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడోరోజు అమ్మవారిని సుందరంగా అలంకరించారు. ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామదేవత మరిడిమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేకపూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

5వేల గాజులతో అలంకరణ: ముమ్మిడివరం మండలం చినకొత్తలంకలోని అమ్మవారి ఆలయంలో అమ్మవారిని 5వేల గాజులతో అలంకరించారు. అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు అభయమిచ్చారు. గోదశివారిపాలెం, అగ్రహారం, అనాతవరం, అన్నంపల్లి, ముమ్మిడివరం, ఠాణేలంక, అయినాపురం, పళ్లవారిపాలెం గ్రామాల్లోని విజయదుర్గా అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆడపిల్లల రక్షణకు పాటుపడాలి

యానాం: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం యానాంలో 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యానాం పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటున్నారన్నారు. ఆడపిల్లల రక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. అనంతరం మథర్ థెరిస్సా నర్సింగ్ స్కూల్, ఐటీఐ విద్యార్థులను యానాంలోని నెం.3 ఐలాండ్‌కు బోటులో తీసుకువెళ్లి.. అక్కడ పలు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్ మేనేజర్ మురళీధరన్, ఆర్.శ్రీనివాస్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

అమలాపురం ఫొటోగ్రఫీ సంఘం ఎన్నిక

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే:. జిల్లా ఫొటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో అమలాపురం నూతన కార్యవర్గ సంఘం ఎన్నికలు కొంకాపల్లి సత్తెమ్మతల్లి ఆలయం వద్ద ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గెడ్డం సురేష్, గౌరవాధ్యక్షుడు కాజా బాబుల అధ్యక్షతన నూతన అధ్యక్షుడిగా చెల్లుబోయిన రమేష్, ఉపాధ్యక్షుడిగా శివకుమార్, కార్యదర్శిగా రెడ్డి శ్రీనివాస్, కోశాధికారిగా కోటీ తదితరులు ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో కె.కృష్ణ, గురు, శివకృష్ణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

రాళ్లదారిలో కష్టాల ప్రయాణం

దర్పణం

ముమ్మిడివరం మండలంలో పళ్లవారిపాలెం నుంచి అన్నంపల్లి వరకు నాలుగు కిలోమీటర్ల మేర ఏటిగట్టు రహదారి ఇది. రహదారి పొడవునా.. నల్లకంకర రాళ్లు తేలిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఏటిగట్టు ఆధునికీకరణ పనుల్లో భాగంగా నల్లకంకర వేశారు. ప్రస్తుతం రాళ్లు పూర్తిగా పైకి తేలి ఈ దారి ధ్వంసమైంది. ఈ రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారిందని.. అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. హెడ్‌వర్క్స్ ఏఈ ఈశ్వరమణ్యంను వివరణ కోరగా.. రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. –న్యూస్‌టుడే, ముమ్మిడివరం



ఆదమరిస్తే అంతే సంగతి..!

అమలాపురం పరిధిలోని ఈదరపల్లి వంతెన శిథిల స్థితికి చేరి ప్రమాదకరంగా ఉంది. బాటచారులు నడిచే మార్గంలో వంతెన శ్లాబు పెచ్చులు ఊడి పోయాయి. ఆదమరిచి నడిస్తే ప్రధాన పంట కాలువలోకి పడిపోయే ప్రమాదం ఉంది. నిత్యం ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఈ వంతెనపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఆ సమయంలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు నడక దారిపై వంతెన దాటేందుకు ప్రయత్నిస్తున్నారు. –న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్



తుప్పలు తొలగించరూ..!

కందికుప్పలోని బొజ్జావారిపేట తుపాను రక్షిత భవనం ఆవరణలో గడ్డి, తుప్పలు మొలిచాయి. ఇదే భవనంలో గ్రామ సచివాలయం, ప్రాథమిక పాఠశాలను నిర్వహిస్తున్నారు. విషపురుగులు సంచరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి కార్యదర్శి రామారావు దృష్టికి తీసుకువెళ్లగా తుప్పలు తొలగించే పనులు చేయిస్తామన్నారు. –న్యూస్‌టుడే: కాట్రేనికోన,



అంతర్వేదిలో పోటెత్తిన భక్త జనం

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. దసరా సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ముందుగా వశిష్ఠ గోదావరి ఘాట్‌లో, సముద్రంలో స్నానాలు చేశారు. అనంతరం లక్ష్మీనరసింహుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వశిష్ఠ ఘాట్‌లో స్నానాలు చేయడానికి ఇబ్బందిగా ఉందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘాట్ లోపల పగిలిన సీసాలు, నాచు ఎక్కువగా ఉండటంతో జారి పడటంతో కాళ్లకు గాయాలవుతున్నాయని వాపోయారు. ఘాట్‌ను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

మద్యం దుకాణాల మూత

అమలాపురం గ్రామీణం: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది సమనసలోని మద్యం దుకాణాన్ని సాయంత్రం అయిదు గంటలకే మూసి వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు తెరిచి ఈ దుకాణాన్ని సాయంత్రం అయిదు గంటలకే మూసివేయడంపై మద్యం ప్రియులు ఆవేదన చెందుతున్నారు. అమలాపురం డిపో మేనేజర్ దశమంతరావును వివరణ కోరగా ఈ నెల 12 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు వస్తున్న నేపథ్యంలో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కొందరు ఉద్యోగులు దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేస్తున్నారని తెలిపారు. డిపో పరిధిలో వంద దుకాణాలు ఉండగా అల్లవరం పరిధిలో 3, ముమ్మిడిరంలో 2, రాజోలులో ఒక దుకాణాన్ని మాత్రమే మూసివేసినట్లు పేర్కొన్నారు. సమనసలోని దుకాణం కొంత సమయం తెరిచి ఉంచారని తెలిపారు.

పాములతో భయాందోళన

కాట్రేనికోన: రామస్వామితోటలోని పోలీసుక్వార్టరు భవనాల చుట్టూ తుప్పలు పెరిగి పాముల సంచారంతో భయందోళనగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాలు శిథిలస్థితికి చేరడంతో సుమారు 15 ఏళ్ల నుంచి ఇక్కడ ఎవరూ నివాసం ఉండటం లేదు. తుప్పలు ఏపుగా పెరిగాయి. పాములు, విషపురుగులు ఎక్కువగా సంచరిస్తూ ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతాన్ని కొంతమంది బహిర్భూమి స్థలంగాను వినియోగిస్తున్నారు. ఆవరణలో తుప్పలు తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని కార్యదర్శి శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళ్లగా తుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మండపేట

•మండపేట •రామచంద్రపురం

పశువుల మేతకు భూమి కేటాయించాలి

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం కోట గ్రామంలో పశువుల మేతకు భూమిని కేటాయించాలని గ్రామానికి చెందిన కోటిపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, తదితరులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టరుకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలో సర్వే నం.478లో వెలసిన లంక ఉంది. పూర్వం ఈ లంకలో గ్రామానికి చెందిన 21 కులాలకు చెందిన పేదలు పశువుల మేపి జీవనం పొంది పొందేవారన్నారు.. ఇప్పుడు దాన్ని గ్రామానికి చెందిన వీల్‌లేబర్ సొసైటీ సభ్యులు ఆక్రమించుకుని అది తమదే, తమకు పట్టాలు ఇచ్చారని చెప్పి ఎవరినీ రానివ్వడం లేదన్నారు. ఈ విషయమై జూన్ నెలలో తహసీల్దార్‌కు సమాచారం హక్కు చట్టం ద్వారా అడిగితే తాము ఎవరికీ పట్టాలు ఇవ్వలేదని లిఖిత పూర్వకంగా చెప్పారన్నారు. కలెక్టరు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

నేడు మండపేటలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

మండపేట గ్రామీణం: మండపేట ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ పాల్గొంటారని ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజా వేదిక జరుగుతుందని, ప్రజల నుంచి అర్జీలు కలెక్టర్ స్వీకరిస్తారని తహసీల్దారు తేజేశ్వరరావు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్, ఆర్.ఐ గౌరి ఏర్పాట్లు పర్యవేక్షించారు.



సమావేశ మందిరాన్ని పరిశీలిస్తున్న మండల అధికారులు

సమస్యలు వినడానికే 'మన గ్రామం... మన సుభాష్'

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా విని పరిష్కరించడానికి మన గ్రామం.. మన సుభాష్ పేరుతో కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం ద్రాక్షారామ, వేగాయమ్మపేట, తోటపేట, అన్నాయిపేట గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు ఆయన హాజరై మాట్లాడారు. ద్రాక్షారామలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రముఖ పుణ్య క్షేత్రం భీమేశ్వరాలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక చేశామని, అవినీతిలో పాత్ర ఉన్న ఈవోను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. ద్రాక్షారామ, వేగాయమ్మపేట సర్పంచులు అడబాల, తుకారాం, జనసేన నాయకుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కె.గంగవరం మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

పామర్రు: మండలకేంద్రం కె.గంగవరాన్ని సమస్యల్లేని గ్రామంగా, మండలాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మనగ్రామం..మన సుభాష్ కార్యక్రమం పేరిట ఆదివారం కె.గంగవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన పలు సమస్యలపై స్థానికులతో చర్చించారు. గ్రామంలో ప్రధానంగా రక్షిత నీటి సమస్య ఉందని చెప్పగా వెంటనే అధికారులతో చర్చించి సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి కోటి వెంకట నర్సమ్మ, ఉపసర్పంచి నేమాని సత్యనారాయణమూర్తి, ఎ.దొరబాబు, ఎన్.సత్యనారాయణ, చిర్రా రాజ్‌కుమార్, గెద్దాడ రమణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఎముకల సమస్య దూరం

మండపేట గ్రామీణం: సరైన పౌష్టికాహారం, తగిన వ్యాయామం లేకపోవడం వల్ల ఎముకలు గుల్లబారి సమస్య తలెత్తుతున్నట్లు రాజమహేంద్రవరం నగరానికి చెందిన వేద హాస్పటల్ డాక్టర్ ఫణీంద్ర అన్నారు. చెల్లూరు గ్రామస్థుల సహకారంతో కమ్మకల్యాణ రైతు భవనంలో వైద్యశిబిరం జరిగింది. ఫణీంద్ర మాట్లాడుతూ ప్రతిరోజూ నడవడం, పౌష్టికాహారం తినడం చేయాలన్నారు. 150 మంది రోగులను పరీక్షించి వైద్య సలహాలు, మందులు అందజేశారు. ముత్యాల సాయిరామ్, ముమ్మిడవరపు కోటేశ్వరరావు, మారిన సాయిరామ్, ముత్యాల శభరీష్, సత్యనారాయణ, సత్తిబాబు పాల్గొన్నారు.

శ్రామికులారా.. ఈ శ్రమ్ గుర్తించారా..

– న్యూస్‌టుడే, పామర్రు

శ్రామికుల అండగా, వారి సామాజిక భద్రతకు కేంద్ర ప్రభుత్వం 'ఈ శ్రమ్' కార్డులను జారీ చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, అనుకోని విపత్తులు సంభవించినప్పుడు ఆర్థిక సాయం అందించడానికి, ఉపాధి కల్పనకు ఈ పథకం వారికి ఎంతగానో దోహదపడుతుంది. ఈ పథకాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం సూచనలతో కేంద్రం ప్రారంభించింది. ప్రస్తుతానికి కార్మికులంతా ఇందులో నమోదయ్యేందుకు ప్రభుత్వం తాజాగా అవకాశం ఇచ్చింది. ప్రస్తుతానికి రామచంద్రపురం, మండపేట, నియోజక వర్గాల్లో ఈ పథకం కింద సగటున 20 శాతం మంది మాత్రమే నమోదయ్యారు. ఇంకా 80 శాతం మంది నమోదై ప్రయోజనం పొందడానికి అర్హత సాధించాల్సి ఉంది.



మధ్యాహ్న భోజన పథకంలో వంట చేస్తున్న అసంఘటిత కార్మికులు

నమోదు ప్రక్రియ ఇలా..

ఈ శ్రమ్‌లో నమోదు పూర్తిగా ఉచితం. కామన్ సర్వీస్ సెంటర్, మీ సేవా కేంద్రాలు, సచివాలయాలు, అంతర్జాలం ఉన్న ఏ కేంద్రం వద్ద అయినా కూడా ఈ ప్రక్రియ జరుగుతుంది. కార్మికశాఖ కార్యాలయాల్లో లేబర్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశారు. అర్హులు ఆధార్, మనుగడలో ఉన్న బ్యాంకు ఖాతా పుస్తకం, చరవాణి తీసుకుని కేంద్రాలకు వెళ్లాలి. ఆయా కేంద్రాల్లో వారు చేస్తారు. 'ఆర్‌ఈజీఐ ఎస్‌టీఈఆర్. ఈఎస్ హెచ్‌ఆర్‌ఎం. జీవోవి. ఇన్' వెబ్ సైట్ ద్వారా వ్యక్తిగత చరవాణిలోనూ వ్యక్తిగతంగా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఇచ్చారు.

సాయం ఎలా అంటే...

ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారికి 12 అంకెల గుర్తింపు సంఖ్య ఇస్తారు. ప్రధాన మంత్రి సురక్ష యోజన పథకం ద్వారా మృతి చెందినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించారు. పాక్షికంగా అంగవైకల్యం కలిగితే లక్ష చొప్పున ఆర్థిక సాయం ఇస్తారు. ఉపాధి కోల్పోయిన కార్మికులను గుర్తించి పని కల్పిస్తారు. కేంద్రం అమలు చేసే సంక్షేమ పథకాలన్నీ నేరుగా శ్రామికులకే అందుతాయి. నగదు రూపంలో వచ్చే సాయం అయితే నేరుగా బ్యాంకు ఖాతాలకే చేరుతాయి. నామినీ వివరాలు ఇస్తే వారి ఖాతాలోకి జమ చేసేందుకు అవకాశం ఉంటుంది.



ఈ శ్రమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్

ఎవరు అర్హులు?

వ్యవసాయ కూలీలు, వలస కార్మికులు, పౌల్ట్రీ, నర్సరీలు, హేచరీలు, ఇళ్లలో పనిచేసే వారు, భవన నిర్మాణ కార్మికులు, మహాత్మాగాంధీ ఉపాధి పథకం జాబ్‌కార్డున్న కూలీలు, చిరు వ్యాపారులు, మత్స్యకారులు, దుకాణాల్లో పనిచేసేవారు, ఆటో, రిక్షా, వ్యాన్, ట్రాక్టరు డ్రైవర్లు, వీధి వ్యాపారులు, చేతి వృత్తులు, కుటీర పరిశ్రమ నిర్వాహకులు, కుల వృత్తులు, ఆశ వర్కర్లు, దినసరి కూలీలు, వార్డు, గ్రామ సచివాలయ వాలంటీర్లు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేకుండా రూ.15వేల లోపు జీతం పొందుతున్న 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉన్న వారంతా అర్హులే.

ఏం జరుగుతోంది?

ఈ శ్రమ్ పోర్టల్ తెరిచి అపుడే నెల దాటిపోయింది. ముగింపు గడువు కూడా దగ్గర పడుతోంది. అయినా కూడా ఇంకా రెండు నియోజకవర్గాల పరిధిలో 20 శాతం మంది కూడా ఈ పథకాన్ని వినియోగించుకోలేదు. పోర్టల్‌లో నమోదు కాని వారెందరో ఉన్నారు. పథకం గురించి కనీస అవగాహన కూడా ఈ వర్గాల శ్రామికుల్లో కొరవడింది. ఉచితంగా నమోదు చేసుకునే వీలున్నా కూడా తెలియకపోవడంతోనే చేయించుకోలేకపోయామని ఆయా వర్గాల కార్మికులు చెబుతున్నారు. ఇప్పటికైనా వారు స్పందించాలి.

ప్రచారం చేయించాం..

ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు కావాలని శ్రామికులందరికీ అందేలా కరపత్రాలు అన్ని చోట్లా పంపిణీ చేశాం. సచివాలయాల అధికారులకు చెప్పి గ్రామాల్లో దండోరా వేయించాం. సభలు, సమావేశాలు నిర్వహించి కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో స్పందన బాగానే ఉంది. అయితే ఈ ప్రాంతంలో మాత్రం ఇంకా తక్కువగానే ఉంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. అర్హతలున్న ప్రతి శ్రామికుడు నేరుగా వారికి దగ్గరలో ఉన్న అంతర్జాలం కేంద్రానికి వెళ్లి నమోదు చేయించుకుంటే వారికి మేలు జరుగుతుంది. బహుళ ప్రయోజనాలున్న ఈ శ్రమ్ కార్డులను అందరూ పొందాలి.

- కాశి శివ నాగమల్లేశ్వరరావు, సహాయ కార్మిక సంక్షేమాధికారి, మండపేట

భాజపా సభ్యత్వాలు త్వరితగతిన పూర్తి చేయాలి

పామర్రు, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ సేకరణ ఉత్సాహంగా చేయాలని, అనకాపల్లి పార్టీ ఇన్‌ఛార్జి కర్రి చిట్టిబాబు సూచించారు. ఆదివారం కోటిపల్లిలో సలాది శేఖర్ అధ్యక్షతన రామచంద్రపురం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. చిట్టిబాబు మాట్లాడారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని సభ్యత్వ సేకరణలో జిల్లాకే ఆదర్శంగా నిలపాలని కోరారు.. కార్యక్రమంలో నాయకులు ఇళ్ల సత్యనారాయణ, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, గుర్రాల సత్యనారాయణ, ఆకేటి శ్రీకృష్ణ, హరిబాబు, రాఘవేంద్ర తదితరులు మాట్లాడారు.



కోటిపల్లిలో మాట్లాడుతున్న చిట్టిబాబు

మండపేట గ్రామీణం: మండపేట గొల్లపుంత టిడ్కో గృహాల వద్ద పట్టణ భాజపా యువమోర్చ అధ్యక్షుడు వెత్సా దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. యువమోర్చ రాష్ట్ర అధ్యక్షుడు బిట్టా వంశీ కృష్ణ, నియోజకవర్గ భాజపా కన్వీనర్ కోటిపల్లి సాయిరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, యువమోర్చ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరగౌడ్ పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రామచంద్రపురం మండల ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ తరపున రూ.1.40లక్షలు విరాళాన్ని అందించారు. ఈ మొత్తానికి చెందిన డీడీలను ఆదివారం ద్రాక్షారామలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి అందజేశారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షుడు, సూర్యపాఠశాల కరస్పాండెంట్ డి.సత్తిబాబు, నియోజకవర్గ అధ్యక్షుడు గుబ్బల రాము, సెయింట్ మేరీస్ చైతన్య పాఠశాల కరస్పాండెంట్ విజయ్, మల్లికార్జున, గిరీష్ ప్రభు, సబీనా, సాయి భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి సుభాష్‌కు డీడీ అందజేత

పూర్వ విద్యార్థుల చేయూత

మండపేట, న్యూస్‌టుడే: మండపేట ప్రభుత్వ పాఠశాల, రథం స్కూలులో 1988వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 'ప్రియమిత్రసంఘం' ఆధ్వర్యంలో చదువుల్లో రాణిస్తున్న 10 మంది విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించే కార్యక్రమం శుభమస్తు కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ర్యాంకులు సాధించిన 10మందికి ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. పేదవిద్యార్థులకు 'ప్రియమిత్ర సంఘం' వెన్నంటి ఉంటుందని సభ్యులు పేర్కొన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు రూ.30వేల చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, సంఘ సభ్యులు ప్రసాదుల భవానీ వీరకుమార్, దొంగ శ్రీనివాస్, పీసపాటి సుబ్బారావు, ఎన్ఎల్ఎస్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు చెక్కు అందిస్తున్న పూర్వవిద్యార్థులు

శ్రీరాములు లేని లోటు తీర్చలేనిది

రామచంద్రపురం: రామచంద్రపురం గుబ్బలవారిపేటకు చెందిన మాజీ కౌన్సిలర్ కట్టా శ్రీరాములు అనారోగ్యంతో బాధ పడుతూ గత మంగళవారం చనిపోయారు. ప్రజా సంఘాల నాయకులు ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా, అనేక వసతిగృహాల్లో వార్డెన్‌గా, రామచంద్రపురం బీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా, కౌన్సిలర్‌గా పనిచేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద వర్గాల విద్యార్థుల కోసం ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. ఆయనలేని లోటు తీర్చలేమన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భీమశంకరం, పీవైఎల్ జిల్లా నాయకులు అంబటి కృష్ణ, కార్మిక సంఘ నాయకులు చింతా రాజారెడ్డి, పీడీఎస్‌యూ నాయకులు కె.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కట్టా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

లలితాదేవీ.. నమోస్తుతే

ద్రాక్షారామ: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా పలు ఆలయాల్లో ఆదివారం విశేష పూజలు జరిగాయి. ద్రాక్షారామ శ్రీమాణిక్యాంబ అమ్మవారిని నాలుగో రోజు లలితా త్రిపురసుందరి దేవి రూపంలో అలంకరించారు. ఆదివారపుపేట శ్రీ శివబాలయోగి ఆశ్రమంలో లలితా త్రిపురసుందరీదేవి రూపంలో అలంకరించారు. ఉదయం, సాయంత్రం కుంకుమపూజలు జరిగాయి. వెలంపాలెం గోగులాంబ, సాక్షివారి వీధి ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాల్లో లలితా పారాయణ జరిగింది.

రాయవరం: వెదురుపాక విజయదుర్గాపీఠంలో విజయదుర్గాదేవి లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితుల ఆధ్వర్యంలో లలితా సహస్రనామాలతో ప్రత్యేక అర్చనలు, కుంకుమార్చన నిర్వహించారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

పామర్రు: పామర్రు శివాలయంలోని పార్వతీ దేవిని ఆదివారం లలితాదేవిగా అలంకరించారు. పామర్రు శెట్టిబలిజపేట, కాపుల కాలనీ, అముజూరు బాలాత్రిపుర సుందరీ దేవి పీఠం, పాణింగిపల్లి, కోటిపల్లి, కోట తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. సత్యవాడ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు విష్ణు, లలిత సహస్రనామాలు, గీతాపారాయణం చేస్తున్నారు.

రామచంద్రపురం: రామచంద్రపురం పట్టణంలో శివాలయం వీధి పార్కువద్ద కనకదుర్గమ్మ అమ్మవారిని లలితాత్రిపుర సుందరీమాతగా, ప్రధాన రోడ్డులో స్వయంభూ జ్ఞాన సరస్వతి అమ్మవారిని లలితాత్రిపుర సుందరీమాతగా, శీలంవారి సావరం రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారిని అలంకరించారు.

మండపేట గ్రామీణం: ఏడిద బల్లగేటు సెంటర్‌లోని దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు.



పామర్రులో పార్వతీదేవి



ఆదివారపుపేటలో...



వెదురుపాకలో...



రామచంద్రపురం కొత్తూరు రోడ్డులో..



రామచంద్రపురం జ్ఞాన సరస్వతి



లలితా త్రిపుర సుందరీమాతగా..

ఆర్థిక సహాయం అందజేత

రాయవరం, న్యూస్‌టుడే: రెండు నెలల క్రితం చెల్లూరు వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవు వెంకటరఘుపతి తీవ్రంగా గాయపడ్డాడు. అతని కుటుంబ సభ్యులకు ఆదివారం జనసైనికులు రూ.1.50 లక్షల సహాయాన్ని అందజేశారు. జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణ పిలుపు మేరకు కోరుమిల్లి జనసేవాదళ సంస్థ, మాచర, ఏడిద, ఏడిద సీతానగరం, సోమేశ్వరం, కూర్మాపురం గ్రామాల నుంచి సేకరించిన నగదును రాజమహేంద్రవరం ఆసుపత్రికి వెళ్లి అందజేశారు.

రూ.లక్ష పెద్దిరాజుకు..


పామర్రు: మండలకేంద్రం కె.గంగవరానికి చెందిన కాద పెద్దిరాజు పక్షవాతంతో బాధపడుతూ జీవనోపాధి లేక అల్లాడుతున్నారు. పేదకుటుంబం కావడంతో మందులు కొనుగోలుకూ ఇబ్బంది పడుతున్నారు. స్థానిక కూటమి నేతలు మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.25 వేలు ఇచ్చారు. ఆయనతో పాటుగా స్థానికులు మరో రూ.75వేలు కలిపి పెద్దిరాజుకు మొత్తం రూ.లక్ష అందించారు. కార్యక్రమంలో నేమాని అబ్బు, పిండికొట్టు సత్తిబాబు, గంగాపాత్రుల కాశీ, అల్లూరి దొరబాబు, టి.ఆనందరావు, చిర్రా రాజ్‌కుమార్, కోటి వెంకట నర్సమ్మ, కె.ప్రసాద్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న జనసేన నాయకులు

పాదులు తొలగిస్తే మేలు

ద్వారపూడి: మండపేట మండలం జడ్.మేడపాడు నుంచి ద్వారపూడి వెళ్లే అనుసంధాన రహదారిలో విద్యుత్తు స్తంభానికి పచ్చని పాదులు అల్లుకున్నాయి. అవితీగలను సైతం తాకుతుండటంతో వాటి ద్వారా విద్యుత్తు ప్రవహించే అవకాశం ఉందని, పొరపాటున ఎవరైనా తాకితే విద్యుదాఘాతారికి గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానికులు ఈ రహదారి నుంచి నిత్యం ఎక్కువ రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. వెంటనే విద్యుత్తు తీగల నుంచి మొక్కల పాదులను తొలగించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. దీనిపై ఏఈ డి.రవికుమార్‌ను వివరణ కోరగా వెంటనే విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న పాదుల తొలగింపునకు సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు.



విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న పాదులు

అరకొర మరమ్మతులతో సరి

మండపేట (ద్వారపూడి), న్యూస్‌టుడే: మండపేట పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బైపాస్ రోడ్డు వరకు రహదారి అధ్వానంగా మారడంతో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండపేట నుంచి ఏడిద, దుళ్ల, రాజమహేంద్రవరం వరకు నిత్యం కళాశాల బస్సులు, రైస్ మిల్లుల వాహనాలు రాకపోకలు సాగించడంతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. దీంతో రహదారి పూర్తిగా ఛిద్రమైంది. గుంతలమయమైన రహదారికి రెండు నెలల క్రితం అరకొర మరమ్మతులు చేపట్టి వదిలేయడంతో మరింత అధ్వానంగా తయారైంది. దీనిపై రహదారులు భవనాల శాఖ డీఈ ఎస్‌వి.సూర్యనారాయణను వివరణ కోరగా మండపేట కమ్మ సంఘం సెంటర్ నుంచి ఏడిద వెళ్లే బైపాస్ రోడ్డు వరకు సీసీ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరైన వెంటనే రహదారి నిర్మాణం మొదలుపెడతామన్నారు.



జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

రామచంద్రపురం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి కరాటే పోటీలకు మోడరన్ జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎం.అక్షయ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యాలయసంస్థల అధినేత జి.వి.రావు తెలిపారు. ఈ సందర్భంగా అక్షయ్‌ని పలువురు అభినందించారు.

మండల న్యాయసేవాధికార సంస్థ రిసోర్స్ పర్సన్ల ఎంపిక

రామచంద్రపురం: మండల న్యాయ సేవాధికార సంస్థ రిసోర్స్ పర్సన్లుగా సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు దొమ్మలపాటి సత్యనారాయణ, పీఎస్‌వీ జానకిని నియమించామని సీనియర్ సివిల్ జడ్జి న్యాయ సేవాధికార సంస్థ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. వీరిద్దరూ గ్రామాల్లో, మున్సిపల్ వార్డుల్లో, పాఠశాలల్లో చట్టాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తారని జడ్జి పేర్కొన్నారు. న్యాయసలహాలకు వారిని సంప్రదించవచ్చన్నారు.



దొమ్మలపాటి సత్యనారాయణ



పి.వి.ఎస్. జానకి

పల్లెల్లో సంపద సృష్టికి అడుగులు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో సంపద కేంద్రాల నిర్మాణాలు పూర్తయినా ఇవి నిరుపయోగంగా మారాయి. ప్రతి పంచాయతీలో సుమారు రూ.5లక్షల నుంచి రూ.10లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో సంపద కేంద్రాలు నిర్మించడానికి 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉండగా చర్యలు తీసుకుంది. అయిదేళ్ల వైకాపా పాలనలో వీటిని పట్టించుకోక పోవడంతో చాలా చోట్ల పునాది దశ దాటని పరిస్థితి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని పంచాయతీల్లో పనులు ఇప్పుడే ప్రారంభమవుతున్నాయి. పంచాయతీల్లో చెత్త నుంచి సంపదసృష్టికి అడుగులు పడుతున్నాయి. మండపేట గ్రామీణంలో 12 పంచాయతీల్లో మారేడుబాక మినహా అన్ని పంచాయతీల్లో సంపదకేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ చెత్తవేరు ప్రక్రియ, వర్మీకంపోస్ట్ తయారీ ఎక్కడా లేని పరిస్థితి ఉంది. చెత్తను రహదారుల పక్కనే వేసి నిప్పు పెడుతున్నారు. కపిలేశ్వరపురం మండలంలో అద్దంకివారిలంక, కేదారలంకల్లో కేంద్రాలు ఏర్పాటు చేద్దామనుకున్నా లంక ప్రాంతాలు కావడంతో ఆపేశారు. కోరుమిల్లి, టేకి, కాలేరు గ్రామాల్లో ఏర్పాటుచేయాల్సి ఉంది.



అసంపూర్తిగా తాపేశ్వరం పేకేటిపాకల వద్ద సంపద కేంద్రం

కేంద్రాలపై దృష్టి సారిస్తాం

సంపద కేంద్రాలపై దృష్టిసారిస్తాం. అసంపూర్తిగా ఉన్నవి పూర్తిచేయడానికి కృషిచేస్తున్నాం. సంపద అభివృద్ధి, వర్మీకంపోస్ట్ తయారీకి ప్రణాళిక చేస్తున్నాం.

- అయిదంరాజు, డీఎల్‌పీవో, రామచంద్రపురం

సెలవులకు ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

కళాశాలలకు, పాఠశాలలకు దసరా సెలవులిచ్చారు. పదిరోజులు సెలవులు దొరకడంతో విహార యాత్రలకు, బంధువుల ఇళ్లకు వెళ్లేవారు చాలామంది ఉంటారు. ఇలా ఇంటికి తాళాలు వేసి వెళ్లిన వారికి ఇల్లు ఎలా ఉందోననే అనుమానం కలగడం సహజం. ఇంటిపైన ధ్యాస యజమానులకు ఆందోళన కలిగిస్తుంది. దీంతో అహ్లాదంగా గడపాల్సిన పర్యటన కాస్తా నీరుగారిపోతుంది. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే నిశ్చింతగా ఎన్నిరోజులైనా ఇంటికి దూరంగా ఉండవచ్చని నిపుణులు పోలీసు అధికారులు సూచిస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో దాదాపు రెండు లక్షల మంది నివశిస్తున్నారు. సుమారుగా 40వేల గృహాలున్నాయి. ఇరుగుపొరుగు వారు ఊరెళ్లినా తెలుసుకునే తీరిక, ధ్యాస పక్కింటి వాళ్లకు ఉండట్లేదు. ఇదే అదనుగా దొంగలు తాళాలు వేసి ఉన్న ఇళ్లను చక్కబెట్టేస్తున్నారు.

– న్యూస్‌టుడే, ద్రాక్షారామ



పోలీసు సిబ్బంది కొరత

రామచంద్రపురం నియోజకవర్గంలో రామచంద్రపురం పట్టణంతో పాటు ద్రాక్షారామ, కె.గంగవరం, గొల్లపాలెంలలో కలిపి నాలుగు పోలీస్టేషన్లు ఉన్నాయి. పట్టణంలో సర్కిల్ కార్యాలయం ఉంది. అయితే ఒక్కో పోలీస్టేషన్లో తగినంత సిబ్బంది లేదనేది వాస్తవం. ఎస్సై, సీఐలు పూర్తిస్థాయిలో ఉన్నా కానిస్టేబుళ్ల కొరత వేధిస్తోంది. ఒక్కోస్టేషన్లో ఉండాల్సిన దానిలో సగం మంది కూడా సిబ్బంది ఉండట్లేదు. పైగా ఉన్నవారిలో డిప్యుటేషన్లపై వేరేచోట పని చేస్తున్నవారే అధికం.

జాగ్రత్తలు పాటించాలి

- ఊళ్లకు వెళ్లాల్సి వస్తే మీ విలువైన వస్తువులను బ్యాంకు లేదా నమ్మకమైన బంధువుల వద్ద భద్రపరచుకోవాలి. బ్యాంకు లాకరు కూడా ఏడాదికి అతితక్కువ ధరకే దొరుకుతున్నందున ప్రజలు తమ విలువైన వస్తువులను భద్రంగా లాకర్లలో దాచుకోవాలి.
- బీరువాకి తాళం వేసి వాటిని బీరువాపైన లేదా మంచం పరుపుకింద పెడుతుంటారు. అలా చేయడం సరికాదు. రహస్యంగా భద్రపరచుకోవాలి.
- బంగారు దుకాణదారులు సీసీ కెమెరాలను తప్పక ఏర్పాటు చేసుకోవాలి. దుకాణాన్ని మూసివేసే సమయంలో నగదు, తదితర విలువైన వస్తువులను లోపల ఉంచకుండా తమతో తీసుకెళ్లాలి. సీసీకెమెరాల ఏర్పాటు కేవలం దుకాణాల భద్రతకుమాత్రమే పరిమితం కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో భద్రతను దృష్టిలో పెట్టుకొని బిగించాలి.

సమాచారం ఇస్తే గస్తీ నిర్వహిస్తాం



ఎక్కడైనా అనుమానితులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఎవరైనా తమ బంధువుల ఇళ్లకు ఊర్లకు వెళితే సమాచారం పోలీసులకు చెబితే ఆప్రాంతాల్లో రాత్రిపూట గస్తీ తిరిగే పోలీసులను అప్రమత్తం చేస్తాం. ఆయాప్రాంతాల్లో పెద్దలకు కూడా జాగ్రత్తలు చెప్తున్నాం. రాత్రిపూట ఎటువంటి ఇబ్బంది తలెత్తినా పోలీసులకు వెంటనే ఫోన్‌ద్వారా సమాచారం అందించాలి. అత్యవసర సమయాల్లో 100 నంబరుకు ఫోన్ చేయాలి.

- కడియాల అశోక్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, రామచంద్రపురం